తిరుపతి జిల్లాకు మరో పారిశ్రామిక మణిహారం



క్రిస్ సిటీ

- నేడు విశాఖ నుంచీ శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- రూ.2139 కోట్లతో 2500 ఎకరాల్లో మౌళిక వసతుల కల్పన
- రూ.37,500 కోట్ల పెట్టుబడులు... 4.67 లక్షల ఉద్యోగాలు వస్తాయన్న అంచనా

తిరుపతి జిల్లాకు మణిమకుటంగా మారనున్న క్రిస్ సిటీకి నేడు ప్రధాని నరేంద్రమోదీ విశాఖపట్టణం నుంచీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. ఇప్పటికే శ్రీసిటీ సెజ్ ద్వారా అంతర్జాతీయ కంపెనీల స్థాపనతో ప్రపంచవ్యాప్త గుర్తింపు అందుకున్న తిరుపతి జిల్లా తాజాగా క్రిస్ సిటీ ప్రాజెక్టుతో మరింత ఉన్నత స్థానానికి చేరనుంది. కృష్ణపట్నం పోర్టు, చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్లను ఆధారంగా చేసుకుని క్రిస్ సిటీ ఏర్పాటవుతోంది. చిల్లకూరు, కోట మండలాల్లో మొత్తం పది వేల ఎకరాల్లో మూడు దశల్లో ఏర్పాటయ్యే క్రిస్ సిటీ రూ.37,500 కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తుందని, తద్వారా 4.67 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంచనా వేస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి-నెల్లూరు జిల్లాల సరిహద్దుల్లోని కృష్ణపట్నం పోర్టు ఏర్పాటుతో ఆ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో ఏపీఐఐసీ పారిశ్రామిక వాడల్లో ఇప్పటికే పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు.



మరోవైపు కృష్ణపట్నం పోర్టును ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు ప్రారంభించింది. దీనికింద కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్ కింద క్రిస్ సిటీని ప్రతిపాదించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం వ్యయం భరించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది.

10,834 ఎకరాల్లో మూడు దశలుగా..


కేంద్రం రూపొందించిన క్రిస్ సిటీ మొత్తం 10,834 ఎకరాలలో మూడు దశలుగా ఏర్పాటు కానుంది. తొలి దశ పనులకు నేడు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. మొదటి దశలో జిల్లాలోని చిల్లకూరు, కోట మండలాల్లో 2500 ఎకరాలు సేకరించి అందులో క్రిస్ సిటీ ఏర్పాటుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ తొలిదశ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2139.43 కోట్లు. మౌళిక సదుపాయాలు కల్పిస్తే ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్ అండ్ అప్పారెల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్, ఇంజనీరింగ్ అండ్ ఎంఎస్ఎంఈ, ఇతర బిల్డింగ్ మెటీరియల్స్ వంటి సెక్టర్ల నుంచీ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఈ రంగాల నుంచీ మొత్తంగా రూ. 37,500 కోట్ల పెట్టుబడులు వస్తాయని, వాటి ద్వారా 4,67,500 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నాయి. క్రిస్ సిటీ ప్రాజెక్టు 2027 ఫిబ్రవరికి పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.

తొలి దశ భూసేకరణ పూర్తి

జిల్లాలోని గూడూరు నియోజకవర్గం చిల్లకూరు, కోట మండలాల పరిధిలో ప్రతిపాదిత క్రిస్ సిటీ ఏర్పాటు కానుంది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, మోమిడి, వెల్లపాలెం, బల్లవోలు గ్రామాలు, అలాగే కోట మండలం కొత్తపట్నం, సిద్ధవరం, కర్లపూడి గ్రామాల నుంచీ భూములు సేకరిస్తున్నారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో 1494.15 ఎకరాలు, తూర్పు కనుపూరులో 400.17 ఎకరాలు, మోమిడిలో 282.61 ఎకరాలు, వెల్లపాలెంలో 1715.71 ఎకరాలు, బల్లవోలులో 1639.09 ఎకరాలు, కోట మండలం కొత్తపట్నంలో 3620.79 ఎకరాలు, సిద్ధవరంలో 745.60 ఎకరాలు, కర్లపూడిలో 936.38 ఎకరాలు చొప్పున మొత్తం 10,834.50 ఎకరాలు సేకరించాల్సి వుండగా ప్రస్తుతానికి తొలిదశ కోసం గుర్తించిన 2500 ఎకరాల్లో ఇప్పటి వరకూ 2,238 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన 262 ఎకరాలు పెండింగులో వుంది.

మొదలైన పనులు : క్రిస్ సిటీలో మౌళిక సదుపాయాల కల్పన కింద రోడ్ నెట్‌వర్క్, వాటర్ సప్లై నెట్‌వర్క్, రీ యూజ్ వాటర్ నెట్‌వర్క్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 132-33 కేవీ సబ్ స్టేషన్, 33-11 కేవీ ఇంటర్నల్ సబ్ స్టేషన్లు వంటివి నిర్మించాల్సి ఉంది. వీటిలో రోడ్లు, బ్రిడ్జి నిర్మాణాల పనులు ఇప్పటికే మొదలయ్యాయి. నేడు ప్రధాని శంకుస్థాపన చేయనుండడంతో ఇక నుంచీ పనులు జోరందుకోనున్నాయి.


చిల్లకూరు మండలం
తమ్మినపట్నం వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు



భయం వద్దు

- జాగ్రత్త పడితే చాలు
- కలకలం రేపుతున్న చైనా కొత్త వైరస్

'కరోనా వైరస్ లాంటిదేదో బెంగళూరు, చెన్నై వరకు వచ్చేసింది. మళ్లీ లాక్‌డౌన్‌లు పడతాయేమో? అందరం ఇంటికే పరిమితమవ్వాల్సిందేనేమో? వంటి ఊహాగానాలు ప్రజల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఏ నలుగురూ జతకూడినా రోజుకొక్కసారైనా కొత్త వైరస్ గురించి మాట్లాడుకుంటున్నారు. కరోనా తాలూకా అనుభవాలు, జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారు. కాగా, నిన్న మొన్నటి వరకు ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్, ఇప్పుడు హెచ్ఎంపీవీ (హ్యూమన్ మెటాన్యూమోవైరస్) కలకలం రేపుతోంది. చైనా నుంచి దిగుమతైన హెచ్ఎంపీవీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అలాంటి భయాందోళనలు అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. అందుకే జిల్లా వైద్య యంత్రాంగం కూడా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా కొత్త వైరస్‌పై లైట్ తీసుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

లక్షణాలిలా.. : కరోనా వచ్చినప్పుడు ఎలాంటి లక్షణాలను గుర్తించామో ఇప్పుడు కూడా అలాంటివే ఉంటాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి. జలుబు, ముక్కుదిబ్బడ, గొంతు నొప్పి, దగ్గు, సాధారణ జ్వరం వంటి లక్షణాలు హెచ్ఎంపీవీలోనూ కనిపిస్తాయి. తుమ్ములు, దగ్గు ద్వారా ఈ వైరస్ ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది.

ఆందోళన వద్దు.. అలాగని నిర్లక్ష్యంగా ఉండొద్దు



హెచ్ఎంపీవీ వలన ఇప్పటికప్పుడు ఆందోళన చెందాల్సిన పనిలేదు. అలాగని నిర్లక్ష్యంగా ఉండొద్దు. కొత్త వైరస్ కాబట్టి ఇమ్యూనిటీ ఉంటుంది. వ్యాధినిరోధక శక్తి లేనివాళ్లకు శ్వాసకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్ ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ఓ కంటకనిపెడుతూ ఉండాలి. అనుమానం వస్తే వైద్యుల్ని సంప్రదించాలి. శ్వాసకోశ వ్యాధి కేసుల అడ్మిషన్లు పెరుగుతుంటే హెచ్ఎంపీవీ సోకిందేమోనని పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సాధారణ స్థితిలోనే కేసులు ఉన్నాయి. జలుబు, దగ్గు ఉన్నా.. జన సమూహాల్లోకి వెళుతున్నా.. ముక్కు, నోటికి కలిపి మాస్కులు పెట్టుకోవడం చాలా ఉత్తమం. సాధారణ వ్యాధి లక్షణాలు కనబడితే ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలి.

- డాక్టర్ సుబ్బారావు,
పల్మనాలజిస్ట్, రుయాస్పత్రి

12న సీఎం చంద్రబాబు తిరుపతి రాక

13, 14 స్వగ్రామంలో బస.. 15న తిరుగు ప్రయాణం

తిరుపతి,జనవరి7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12వ తేదీన తిరుపతి రానున్నారు. తిరుపతిలోని తాజ్ హోటల్‌లో జరిగే గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. అనంతరం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లె చేరుకుంటారు. ఈనెల 13, 14 తేదీల్లో అక్కడే గడిపి.. 15న అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు. ఏటా సంక్రాంతి సందర్భంగా నారా, నందమూరి కుటుంబీకులు నారావారిపల్లెలో రెండు మూడు రోజుల పాటు బస చేసి పండుగ జరుపుకొని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా చంద్రబాబు సైతం క్రమం తప్పకుండా కొన్నేళ్లుగా కుటుంబంతో సహా స్వగ్రామానికి వచ్చి పండుగ ఇక్కడే జరుపుకుంటున్నారు.అయితే ఇటీవల సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతి చెందిన నేపథ్యంలో ఏడాది పాటు పండుగలేవీ జరుపుకునే పరిస్థితి లేదు. ఈ ఏడాది పండుగ జరుపుకోకపోయినా ఆ రోజుల్లో స్వగ్రామంలోనే గడుపుతారని అనధికారిక సమాచారం. కాగా, సీఎం చంద్రబాబు పర్యటన ఇప్పటివరకూ అధికారికంగా ఖరారు కాలేదు.



కార్యకర్త కుమారుడికి ఆర్ఎస్ జితేంద్ర అని నామకరణం చేసి, ఆశీర్వదించారు

ఆరోగ్యం.. ఆదాయం.. ఆనందం

కుప్పం, జనవరి7 (ఆంధ్రజ్యోతి): 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ అనే మూడు సూత్రాలతో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం నా లక్ష్యం. ఇందుకోసం రూ.550 కోట్లతో వివిధ పరిశ్రమలకు, పథకాలకు ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నాను. ఈ పనులన్నీ మీకోసమే. సద్వినియోగం చేసుకోవడం మీ చేతుల్లోనే ఉంది.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. కుప్పం పర్యటనలో రెండో రోజైన మంగళవారం ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడమే కాకుండా ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు. కుప్పంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాల అనంతరం లబ్ధిదారులు, ప్రజలతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

● కుప్పంలో జనాభా, నైపుణ్యం రెండూ పెరగాలి

కుప్పంలో జనాభా రానురాను తగ్గిపోతోంది. జనాభా పెరగడంతోపాటు, యువతలో నైపుణ్యం కూడా పెంచాలి. ప్రపంచ స్థాయి ఎడ్యుకేషన్ అందాలి. మనం నెక్స్ట్ లెవెల్‌కు వెళ్లాలి. సంపద సృష్టించి, తలసరి ఆదాయం పెంచాలి. అందుకు అవసరమైన ప్రణాళికలు నేను తయారు చేయించాను. మీరు వాటిని ఉపయోగించుకుని సర్వతోముఖాభివృద్ధి చెందాలి.

● నాలుగు అంశాలే ప్రధానం

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నాలుగు అంశాలే ప్రధానం. పేదరిక నిర్మూలన, ఆర్థిక స్థితిగతుల ఉన్నతి, ఉద్యోగ ఉపాధి కల్పన, జనాభా నిర్వహణ (పాపులేషన్ మేనేజ్‌మెంట్). ఈ నాలుగు అంశాలే ప్రధానంగా స్వర్ణ కుప్పం విజన్ డాక్యుమెంట్ 2029 తయారైంది. యువతలో, మహిళలల్లో నైపుణ్యాలను శిక్షణ ద్వారా పెంచి, ఉద్యోగ, ఉపాధి కల్పన చేయడం ద్వారా ఈ నాలుగు అంశాలను సాధించే అవకాశం ఉంది. ఆ దిశగానే నేటి అభివృద్ధి కార్యక్రమాలు రూపొందాయి. కడా బాగా పనిచేస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పారిశ్రామికవేత్తలను, వివిధ రకాల ఏజెన్సీలను కుప్పం పిలిపించి ఒప్పందాలు చేయించారు. ఈ కార్యక్రమాలన్నీ పూర్తయితే ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్త తయారవుతారు. మరికొందరికి ఉద్యోగాలు ఇవ్వగలిగే స్థాయికి ఎదుగుతారు.

● విమానాల మరమ్మతు స్టేషన్

కుప్పంలో త్వరలోనే విమానాశ్రయం వస్తోంది. ఇక్కడి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల రవాణాకోసం కార్గోతోపాటు డొమెస్టిక్ విమానాశ్రయం కూడా రూపుదాలుస్తుంది. మీరు కూడా విమానం ఎక్కి ఎక్కడికైనా వెళ్లొచ్చు. ఈ విమానాశ్రయం దగ్గరే విమానాలను రిపేరు చేసే వర్క్ స్టేషన్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటాను. విమానాశ్రయం, వర్క్ స్టేషన్ వల్ల ప్రత్యక్షంగానే కాక, పరోక్షంగా వేల మందికి ఉపాధి దొరుకుతుంది.

● మూడు నెలల తర్వాత మళ్లీ వస్తా

ఇప్పుడు ఏయే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానో, అవన్నీ ఈ మూడు నెలల్లో ఒక స్టేజీకి వస్తాయి. నేను మూడు నెలల తర్వాత మళ్లీ వస్తాను. అప్పుడు అభివృద్ధిని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకు వెళ్తాను.

మెడికల్ ఇంటెగ్రిటీ

ప్రజారోగ్యం చాలా ముఖ్యం. ఆరోగ్యంగా ఉంటేనే ఏపని అయినా సాధించగలం. అందుకోసం మెడికల్ ఇంటెగ్రిటీ తీసుకొస్తాను టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎండీ ఇక్కడికి వచ్చారు. ఆయనతో ఇప్పుడే చర్చలు జరిపాను. కోలార్ జిల్లాలో మెడికల్ ఇంటెగ్రిటీని వారు తీసుకొచ్చారు. అదే తరహాలో టాటా మెడికల్ సైన్సెస్ ద్వారా చిత్తూరు జిల్లాలో మెడికల్ ఇంటెగ్రిటీ తీసుకొస్తాను. అంటే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను అనుసంధానం చేస్తాను. తద్వారా ప్రతి ఒక్కరి మెడికల్ రికార్డు ఆన్‌లైన్ ద్వారా నమోదవుతుంది. ఎవరికి ఏ వైద్య సాయం అందాలన్నా క్షణంలో పొందే అవకాశం ఉంటుంది. ఈ మెడికల్ ఇంటెగ్రిటీని మొదట కుప్పంనుంచే ప్రారంభిస్తాను. తర్వాత చిత్తూరు జిల్లాకు, ఆపైన రాష్ట్రానికి విస్తరిస్తాను. కుప్పం నాకు ఒక ప్రయోగశాల. ఏ ప్రతిష్ఠాత్మక పథకమైనా ఇక్కడినుంచే ప్రారంభించి.. రాష్ట్రమంతటా విస్తరించడం ఒక విధానంగా అమలు చేస్తున్నాను. దీనితోపాటు స్వచ్ఛ సమాజం కూడా తీసుకొస్తే కుప్పం ప్రజల ఆయుష్షు సాధారణం కంటే మరో 20-30 ఏళ్లు పెరుగుతుంది.

ఆనందగిరి ఆలయానికి డబుల్ రోడ్డు



పాకాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాకాల సమీపంలోని ఊట్లవారిపల్లె ఆనందగిరిపై వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఊట్లవారిపల్లె నుంచి ఆలయం వరకు వున్న రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించడానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు మంజూరు చేయించారు. రూ.కోటి వ్యయంతో తడకర చెరువు కట్టపై 40 అడుగుల రోడ్డు, అందులో 30 అడుగుల సీసీ రోడ్డు, మధ్యలో డివైడర్, రోడ్డుకిరువైపులా మూడు అడుగుల ఫుట్‌పాత్ నిర్మించనున్నారు. ఊట్లవారిపల్లె నుంచి ఆలయం వరకు ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. 600 మీటర్ల మేర విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈవో బాబ్జీ కోరారు. దామలచెరువు జడ్పీ హైస్కూల్లో మంగళవారం ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని, విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హేమలత పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలకు ఇస్కాన్ భోజనం



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీవైఈవో బాలాజీ, ఎంఈవో

చంద్రగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని బాలుర, బాలికల జూనియర్ కళాశాలకు ఇస్కాన్ భోజనం అందిస్తామని డీవైఈవో బాలాజీ అన్నారు. మంగళవారం చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. భోజనంలో నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌బాబు, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిది



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ప్రదీప

భాకరాపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీడీపీవో ప్రదీప అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం పరిషత్ సమావేశ మందిరంలో కిశోరి వికాసంపై అంగన్వాడీ, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్షత, నైపుణ్య ఉపాధి, లైంగిక వేధింపుల నుంచి రక్షణ నాణ్యమైన విద్య, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలు, వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, ఈవోపీఆర్డీ సోమశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగరాణి, ఎంఈవో గోపినాథ్, మెడికల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీహెచ్‌వో అమరనాథ్‌రెడ్డి, ఏపీఎం స్వర్ణలత, ఏసీ డీపీవో జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని పాల్గొన్నారు.

ఈ-పంటను నమోదు చేసుకోండి



దిగువూరులో పొలంబడి నిర్వహిస్తున్న సిబ్బంది

భాకరాపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్లో రైతులు సాగు చేస్తున్న పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఏవో ధనలక్ష్మి కోరారు. చిన్న గొట్టిగల్లు మండలంలోని ఎగువూరు, దిగువూరు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పంటల బీమా, పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. భూసార పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఉలవ పంటలను పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డీకేటీ భూములను పునరుద్ధరించండి

రెవెన్యూ సదస్సులో అనుపల్లె రైతుల వేడుకోలు



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దారు

రామచంద్రాపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 200 మంది పేద రైతులకు ఇచ్చిన డీకేటీ భూములను పునరుద్ధరించాలని తహసీల్దారు వెంకట రమణకు రైతులు వినతులు ఇచ్చారు. అనుపల్లె పంచాయతీలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బింధుమాధవి మాట్లాడుతూ అనుపల్లె పంచాయతీలో గత జన్మభూమి, ప్రజల వద్దకు పాలన కార్యక్రమాల్లో 300 ఎకరాల భూములను 1.5ఎకరాల చొప్పున 200మందికి పంపిణీ చేశార న్నారు. రైతులు అభివృద్ధి చేసుకున్న తరువాత వాటిని రద్దు చేశారన్నారు. ఆర్‌సీ పురం మండలంలో జగన్ నిర్వహించిన పాదయాత్ర సమయంలో రద్దు భూములపై వినతులు ఇస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు. తహసీల్దారు వెంకట రమణ మాట్లాడుతూ మండలంలో 241 రెవెన్యూ సమస్యలు రాగా 58 పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకుడు జనార్ధనచౌదరి, సర్పంచ్ గోవర్ధన్, నాయకులు దేవరాజులు, వెంకటేష్‌నాయుడు, ప్రకాష్, ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వో రాజ శేఖర్, వెంకటరమణ, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పాకాలలో ముగిసిన రెవెన్యూ సదస్సులు



అర్జీలు తీసుకుంటున్న తహసీల్దార్ సంతోష్‌సాయి

పాకాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత డిసెంబరు 6వ తేదీ ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. 15 రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. మంగళవారం పాకాల రెవెన్యూ గ్రామ పరిధిలో తహసీల్దార్ సంతోష్‌సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజలు 90 అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

చంద్రగిరి

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సోమశేఖర్‌రెడ్డి

భాకరాపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సోమశేఖర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో గిడ్డయ్య అనారోగ్య కారణాల రీత్యా సెలవుపై వెళ్లడంతో ఆయన తిరిగి విధుల్లో చేరే వరకు సోమశేఖర్‌రెడ్డి ఇన్‌చార్జ్‌గా వ్యవహరించనున్నారు.

పాకాల సీఐగా సుదర్శన ప్రసాద్



పాకాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాకాల సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా సుదర్శన ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో వున్న ఆయన బదిలీపై వచ్చారు. స్టేషన్‌లో సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



తిరుచానూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్ చదువుతున్న 90 పేద విద్యార్థులకు మంగళవారం లక్కీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం పరీక్షలకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపుర, కార్యదర్శి మూర్తి, ప్రధానోపాధ్యాయుడు మురళి, టీచర్లు పాల్గొన్నారు.

అంబులెన్స్ ఘటనలో మరో మహిళ మృతి



తులసమ్మ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులపైకి అంబులెన్స్ దూసుకెళ్లిన ఘటనలో మరో మహిళ మృతి చెందింది. మండలంలోని నరసింగాపురం సమీపంలో నారాయణ కళాశాల వద్ద మదనపల్లె- తిరుపతి జాతీయ రహదారిలో సోమవారం తెల్లవారుజామున పాదయాత్రగా వెళ్తున్న భక్తులపైకి 108 దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందగా ఐదుగురు గాయపడిన విషయం తెలిసిందే. ఇదే ఘటనలో గాయపడిన తులసమ్మ(42) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈమెది అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చింపిరిపల్లె. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తనిఖీలు



తిరుపతిలోని ఓ హోటల్‌లో మంగళవారం తనిఖీ చేస్తున్న స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి తదితరులు

వైకుంఠ దర్శనానికి కాలినడకన తిరుమలకు

సుండుపల్లె నుంచి వందలాది మంది పాదయాత్ర



ఎర్రావారిపాళెం మీదుగా సాగుతున్న భక్తుల యాత్ర

ఎర్రావారిపాళెం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీన వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు భారీగా తిరుమలకు కాలినడకన తరలివెళ్తున్నారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలానికి చెందిన వందలాది మంది గోవింద మాల ధరించిన భక్తులు కాలినడకన తిరుమలకు బయలుదేరారు. 145 కిలో మీటర్ల దూరం కాలినడకన తిరుమల చేరుకోనున్నారు. పాదయాత్ర చేస్తున్న భక్తులకు పలు గ్రామాల్లో ప్రజలు తాగునీరు, అల్పాహారం అందిస్తున్నారు.

వారి ఆయుధాలు వెనక్కి ఇచ్చేయండి

నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోండి ● పోలీసులకు హైకోర్టు ఆదేశం

● పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిల పిటిషన్లపై న్యాయస్థానం

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న లైసెన్స్ ఆయుధాలను వెనక్కి ఇచ్చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తీర్పు ప్రతి అందిన రెండువారాల్లో ఆయుధాలను అప్పగించాలని స్పష్టం చేసింది. ఆయుధాలు అప్పగించిన తరువాత పిటిషనర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకొనేందుకు పోలీసులకు స్వేచ్ఛనిచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా తాను అప్పగించిన బోర్ పిస్టోల్, రివాల్వర్, డబుల్ బ్యారెల్ గన్‌ను వెనక్కి ఇచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఎన్నికలు ముగిశాక కూడా ఆయుధాలను అధికారుల వద్దే ఉంచుకున్నారన్నారు. ఆయుధాలు తిరిగి ఇవ్వాలని వినతులు సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రాణహాని ఉన్న నేపథ్యంలో వాటిని వెనక్కి ఇచ్చేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో అభ్యర్థించారు.

ఆలయ పనులు అడ్డుకుంటున్నారు

● చర్యలు తీసుకోండి ● కాలూరు గ్రామస్తుల వినతి



మాట్లాడుతున్న గ్రామస్తులు

తిరుపతిరూరల్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): సి.మల్లవరం పంచాయతీ పరిధిలోని కాలూరులో పునర్నిర్మిస్తున్న పురాతన శ్రీరామ భజనమందిరం పనులను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రామంలో 70ఏళ్ల చరిత్ర ఉన్న రామాలయం శిథిలావస్థకి చేరుకోవడంతో దేవదాయశాఖ నిబంధనల ప్రకారం కాంట్రిబ్యూషన్ డిపాజిట్ చేసి, కమిషనర్ సూచనమేరకు రూ.27లక్షల వ్యయంతో ఆలయాన్ని పునర్ నిర్మిస్తున్నామని తెలిపారు. కొందరు దీన్ని అడ్డుకుంటున్నారని ప్రశ్నించిన వారిపై దాడికి దిగుతున్నారని వాపోయారు. ఇనాందారి గ్రామంలో ఉన్న రాములవారి ఆలయ స్థలం తమదని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎంఆర్‌పల్లె పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఎస్ఐ షేక్షావల్లి సాయంత్రం గ్రామానికి చేరుకుని స్థానికులను విచారించారు. గ్రామస్తులు ఎస్.చాముండేశ్వరి, నీలిమ, విజయ, సుబ్బమ్మ, వై.సాంబశివ, సుబ్రమణ్యం, గురవయ్య, నాదముని, వాసు, కేశవులు, విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను రాజకీయం చేయొద్దు

● మృతుల కుటుంబాలకు మెగా ఫ్యామిలీ అండగా ఉందన్న జనసేన



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నేత కిరణ్‌రాయల్

తిరుపతి(కపిలతీర్థం), జనవరి7(ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో గేమ్‌చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ చూసుకుని తిరుగు ప్రయాణంలో జరిగిన అభిమానుల రోడ్డు ప్రమాదంపై రాజకీయం చేయవద్దని జనసేన నేత కిరణ్‌రాయల్ సూచించారు. ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదాన్ని రాజకీయం చేస్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై వైసీపీ విమర్శలు చేయడం బాధాకరమన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు మెగా ఫ్యామిలీ అండగా ఉందన్నారు. బైక్ ప్రమాదంలో మృతిచెందిన మణికంఠ, చరణ్ కుటుంబాలకు పవన్, హీరో రామ్‌చరణ్, నిర్మాత దిల్‌రాజు రూ.10లక్షల వంతున రూ.30 లక్షలు ప్రకటించినట్లు గుర్తుచేశారు. గతంలో బాబాయ్ హత్యను గుండెపోటుగా చిత్రీకరించిన వారికి వైసీపీ శిక్ష పడేలా చేయాలన్నారు. చేతనైతే ఏడు నెలల కూటమి ప్రభుత్వ అభివృద్ధిపై చర్చకు రావాలేకానీ, ఇలా తప్పుడు ప్రచారాలు చేయరాదన్నారు. ఈ సమావేశంలో హేమంత్, సాయిదేవ్, శ్రీనివాసులు, గోపి, సాయి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎంబీయూకు ఆర్టీసీ బస్సు స్టాపింగ్

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజల సౌకర్యార్థం ఎ.రంగంపేట మోహన్‌బాబు యూనివర్శిటీ వద్ద ఆర్టీసీ బస్సుల స్టాపింగ్ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం నుంచి బస్సులు ఆగుతాయని వివరించారు. డీజిల్ బస్సులతో పాటు ఎలక్ట్రిక్ బస్సులను ఆపనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైకుంఠ ఏకాదశి పార్కింగ్ ఏర్పాట్ల పరిశీలన

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా పదిరోజుల పాటు జరుగనున్న వైకుంఠద్వార దర్శనాల సందర్భంగా తిరుమలలో చేస్తున్న ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లను టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, అదనపు ఈవో రామకృష్ణతో కలిసి ఈవో శ్యామలరావు మంగళవారం పరిశీలించారు.

● ఏకాదశిరోజు సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు, టీటీడీ సభ్యులకు రాంభగీచా బస్టాండ్ కిందవైపున పార్కింగ్ ఏర్పాటు చేయగా, సుపథం నుంచి దర్శనాలకు అనుమతిస్తారు.

● ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విప్‌లు, కార్పొరేషన్ ఛైర్మన్లకు ఎంప్లాయిస్ క్యాంటీన్ వెనుకవైపు పార్కింగ్ ఏర్పాటు చేశారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1 మెయిన్ గేట్ నుంచి దర్శనానికి అనుమతిస్తారు.

● అఖిలభారత సర్వీసు అధికారులకు, ఇతర సీనియర్ అధికారులకు నందకం, వకుళామాత విశ్రాంతి గృహాల పరిసర ప్రాంతాలు, ఫైర్‌స్టేషన్ వెనుక పార్కింగ్ కేటాయించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1 వద్దనున్న ఎల్2 గేట్ నుంచి దర్శనానికి అనుమతిస్తారు.

● శ్రీవాణిట్రస్టు దాతలకు వరాహస్వామి గెస్ట్‌హౌస్ ఎదురుగా ఉన్న సేవాసదన్ వద్ద పార్కింగ్ కేటాయించారు. ఫుట్‌పాత్ హాల్ నుంచి దర్శనాలకు అనుమతిస్తారు.

● ఇతర దాతలకు ఎన్6 గేట్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. వీరు రూ.300 ప్రత్యేక దర్శన టికెట్ల హాల్ నుంచి దర్శనాలకు వెళ్లాల్సి ఉంటుంది.

● ఎస్ఈడీ టికెట్లు ఉన్న భక్తులను ఏటీసీ సర్కిల్‌లోని స్టోన్ ఆర్చ్ నుంచి, ఎస్ఎస్‌డీ టోకెన్లు కలిగిన భక్తులను కృష్ణతేజ సర్కిల్ నుంచి క్యూలైన్లలోకి అనుమతించి దర్శనం కల్పిస్తారు.

మద్యం బాటిళ్లతో వీరంగం ఘటనలో

ఆరుగురి అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న ఈస్ట్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం తోటి స్నేహితునిపై మద్యం సీసాలతో దాడి చేసి గాయపరచిన ఘటనలో ఈస్ట్ పోలీసులు మంగళవారం ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. బండ్ల వీధికి చెందిన కందన్ సాయికుమార్ ఆటో డ్రైవర్. గతంలో తిరుమల దారిలో ఏడో మైలు వద్ద బొరుగులు గంప పెట్టుకుని వ్యాపారం చేసేవాడు. ఆ సమయంలో కార్వేటినగరానికి చెందిన ధనవేలుతో పరిచయమైంది. వారిద్దరూ తరచూ మద్యం తాగేవారు. ఆ తర్వాత సాయికుమార్ తిరుపతిలో ఆటో తోలుకుని బతుకుతున్నాడు. ధనవేలు అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి అతడితో కలిసి మద్యం తాగేవారు. తిరుమలలో ధనవేలుకు కొత్త స్నేహితులు పరిచయం కావడంతో తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని సాయికుమార్ భావించాడు. అందుకే తనకు మద్యం తీసివ్వడంలేదని భావించి అతడిని తరచూ కొట్టేవాడు. దీంతో సాయికుమార్ వల్ల తనకు ప్రాణహాని ఉందన్న భయంతో ధనవేలు తిరుమల కొండపై దారాలు అమ్ముకుంటున్న కర్నాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్‌కు చెందిన శ్రీనివాసులు, లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న చందు, చెన్నైకు చెందిన మహాప్రభు, రెడ్‌హిల్స్‌కు చెందిన తమిళ అరసన్, చిన్నమండెం మండలంచ మల్లూరు గ్రామానికి చెందిన డేరంగుల శివతో కలిసి సోమవారం సాయికుమార్‌ను మద్యం కోసం పిలిపించారు. బస్టాండు సమీపంలోని ఫుల్‌గా మద్యం తాగారు. అందరూ కలసి సాయికుమార్‌పై బీరుబాటిళ్ళతో దాడి చేసారు. తీవ్రంగా గాయపడిన సాయికుమార్ తప్పించుకుని ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని డీఎస్పీ చెప్పారు. సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ, నిందితులను ఆర్టీసీ బస్టాండులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మద్యం మత్తులో కాలువలో పడి ఒకరి మృతి



కాలువలో పడి మృతిచెందిన నందారావు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన లీలామహల్ సర్కిల్ సమీపంలోని సుబ్బారెడ్డి నగర్‌కు వెళ్లే రోడ్డుపై మంగళవారం సాయంత్రం జరిగింది. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. సుబ్బారెడ్డినగర్‌కు చెందిన నందారావు(56) స్నేహితులతో కలసి మద్యం సేవించాడు. అక్కడ నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్న సమయంలో రోడ్డుకు పక్కనే వున్న కాలువలో మూత్ర విసర్జనకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఈస్ట్ బ్లూకోల్ట్ పోలీసులు వచ్చి మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీశారు.

వివేకానందుడి జీవితం ఆదర్శం



సభలో మాట్లాడుతున్న సుకృతానంద

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వివేకానందుడి జీవితం ఆదర్శనీయమని రామకృష్ణ మఠం కార్యదర్శి సుకృతానంద పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన వివేకానందుడి 163 వ జయంతి సభలో ఆయన మాట్లాడారు. తన ప్రసంగాలు, రచనల ద్వారా యువతకు వివేకానందుడు మార్గ నిర్దేశం చేశారని అన్నారు. బలమే జీవనం - బలహీనతే మరణమని చెప్పారని గుర్తుచేశారు. యువత మానసిక బలాన్ని పెంచుకోవాలని సూచించారని తెలిపారు. భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, ఆయుర్వేద నిపుణుడు మురళీకృష్ణ, ప్రొఫెసర్ పీవీ రెడ్డి మాట్లాడుతూ వివేకానందుడి జీవితం నుంచి ఏకాగ్రత, ధ్యానం, వ్యక్తిత్వ భావనలను స్వీకరించాలన్నారు. సత్వస్థానంద నేతృత్వంలో భక్తి గీతాలపన సాగింది. అంతకు ముందు ఎస్వీ మెడికల్ కాలేజీ ముందున్న వివేకానందుడి విగ్రహానికి పుష్పాంజలి, అక్కడి నుంచీ శోభా యాత్ర చేపట్టారు. విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్



డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న సీఐ హరిప్రసాద్

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనం కోసం భక్తులు భారీగా తిరుమలకు వస్తారని, వారికి సురక్షితమైన ప్రయాణాన్ని అందించేలా ఆర్టీసీ డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ సూచించారు. తిరుమలలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయన మంగళవారం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. భక్తులను సురక్షితంగా తిరుమలకు తీసుకొచ్చి తిరిగి తిరుపతికి తరలించేందుకు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఘాట్‌రోడ్డులో అర్హత ఉన్న బస్సులను మాత్రమే నడపాలన్నారు.

పెన్షనర్ల ఎంపికను పరిశీలించిన కమిషనర్



తిరుపతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో మంచానికి, కుర్చీకి పరిమితమైన పెన్షనర్ల ఎంపికను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పక్షవాతంతోనూ, ఏదైనా ప్రమాదవశాత్తు, 80 శాతం వికలత్వం ఉన్న వారికి రూ.15వేలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఇలాంటి వారు నగరపాలక సంస్థ పరిధిలో 52మంది ఉన్నారన్నారు. వీరి పెన్షన్‌ను పెంచేందుకు మరోమారు వైద్య బృందంతో తనిఖీ చేస్తున్నామన్నారు. వీరి ఎంపిక పూర్తయిన తరువాత ప్రభుత్వం రూ.15వేల పెన్షన్ ఇస్తుందని చెప్పారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, వైద్యుల బృందం, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

అన్న క్యాంటీన్లలో రుచి, శుచి ముఖ్యం

తిరుపతి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉంచి, నాణ్యమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్థానిక స్విమ్స్ సర్కిల్, న్యూ బాలాజి కాలనీ, ముత్యాలరెడ్డి పల్లి, ఈఎస్ఐ హాస్పిటల్ వద్దగల అన్న క్యాంటీన్లను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, ప్రజలకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందించడమే కాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కమిషనర్ వెంట డీఈ మహేష్, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

వడ్డెర ఓబన్న జయంతిని జయప్రదం చేయండి

తిరుపతి(కపిలతీర్థం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన తిరుపతి ఆర్టీసీ బస్టాండు వద్ద తలపెట్టిన రేనాటి వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతి వేడుకలను జయప్రదం చేయాలని జిల్లా వడ్డెర సంఘ అధ్యక్షుడు గుంజు మదన్‌మోహన్ కోరారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండు వద్ద గల జాతీయ జెండా వరకు ర్యాలీ నిర్వహించి, ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి అన్నదానం చేస్తామని తెలిపారు. తిరిగి అక్కడి నుంచి రేణిగుంట బస్టాండు వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో వడ్డెర సంఘం రాయలసీమ అధ్యక్షుడు దేవళ్ల శ్రీనివాసులు, దేవళ్ల రమణ, వేముల నాగరాజ, వేముల బాబు, బత్తలవాసు, సుబ్రహ్మణ్యం, జ్యోతి, లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీ చెత్తను మీరే ఎరువుగా మార్చుకోండి

- వంద కేజీలు దాటితే ఇదే పద్ధతి పాటించాల్సిందే
- కమిషనర్ మౌర్య

తిరుపతి, జనవరి7(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కువ చెత్త ఉత్పత్తి చేసే వాణిజ్య సముదాయాలు, అపార్ట్ మెంట్స్ (బల్క్ జనరేటర్స్) వారు తడిచెత్తను స్వయంగా కంపోస్టు ఎరువుగా మార్చుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరంలో చెత్త ఎక్కువ ఉత్పత్తి చేసే వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, రెస్టారెంట్ల యాజమానులతో మంగళవారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 100 కేజీల కంటే ఎక్కువ చెత్తను ఉత్పత్తి చేస్తున్న వారంతా తడిచెత్తను వాళ్ల పరిధిలోనే కంపోస్ట్ ఎరువుగా మార్చుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పొడిచెత్తను నగరపాలక సంస్థ సిబ్బందికి అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



అమ్మ శ్రీ కరుణామయి - డీఎస్ చౌహాన్

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో- ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనవేత్త అమ్మ కరుణామయి, తెలంగాణ డీజీ డీఎస్ చౌహాన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

అధికారులు స్పందించి న్యాయం చేయాలి

తిరుపతి(లీలామహల్), జనవరి7(ఆంధ్రజ్యోతి): గొల్లవానికుంట గ్రామం, అక్కారంపల్లె రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన 1.39 ఎకరాల భూమి నిజమైన బాధితులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బాధితులతో కలిసి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సదరు భూమిని 15 మంది కొనుగోలు చేశారని తెలిపారు. అయితే కొందరు ఈ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్పీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశామన్నారు. కలెక్టర్ స్పందించి భూ ఆక్రమణపై విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో బాధితులు చొప్పా రామచంద్రారెడ్డి, సుబ్బలక్ష్మమ్మ, ప్రతాప్‌రెడ్డి, కేకే.రెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆన్‌లైన్ బుకింగ్ సేవకుల మేళా

తిరుపతి(లీలామహల్), జనవరి7(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆన్‌లైన్ బుకింగ్ సేవకుల కోసం కచ్చపి ఆడిటోరియంలో గురువారం ఉదయం 9 గంటలకు హోం ట్రయాంగిల్ యాప్ మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మౌర్య తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ స్వయం ఉపాధిలో భాగంగా ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మిషన్, వాటర్ ప్యూరిఫయర్, గీజర్ రిపేరు, వడ్రంగి, ప్లంబింగ్, విద్యుత్, బూటీషియన్స్ సేవలు అందించాలనుకునే పురుషులు, మహిళలు ఈ మేళాను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందవచ్చన్నారు.

తిరుపతి

ఏకాదశి టోకెన్ల జారీ కేంద్రాల్లో ఏర్పాట్లు షురూ







రామచంద్ర పుష్కరిణి వద్ద వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు - బ్లాక్ చేసిన గిరిపురం రోడ్డు - జీవకోన వద్ద ఏర్పాట్లు

తిరుపతి(లీలామహల్)/తిరుపతి(నేరవిభాగం), జనవరి7(ఆంధ్రజ్యోతి): నగరంలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ కోసం ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం రామచంద్ర పుష్కరిణి వద్ద రోడ్డు బ్లాక్ చేసి ఒకవైపు మాత్రమే వాహనాల రాకపోకలు సాగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. గిరిపురం రోడ్డులో ఒకవైపు బ్లాక్ చేసి ఆ మార్గంలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

టోకెన్లు జారీ చేసే కేంద్రాలను పరిశీలించిన సీవీఎస్‌వో, ఎస్పీ

వైకుంఠ ఏకాదశి టోకెన్ల కౌంటర్లను టీటీడీ సీవీఎస్‌వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి పరిశీలించారు. తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి, ఇతర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తిరుమలలో ఒక కౌంటర్, తిరుపతిలో 9 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలియజేశారు. ఆ కౌంటర్ల వద్ద అవసరమైన బందోబస్తు, ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రధానమైన దర్శన మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పిల్లలు, వృద్ధులు, వికలాంగులు కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణం, విజిలెన్సు డీఎస్పీ సుధారాణి, గిరిధర్, డీఎస్పీలు వెంకటనారాయణ, గిరిదర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా అరికడతాం : ఎస్పీ శ్రీనివాస్



టాస్క్‌ఫోర్స్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్

మంగళం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శేషాచల అటవీ ప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పెంచలకోన, బద్వేల్, సిద్ధవటం, లంకమల అటవీ ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం పెంచలకోన, బద్వేల్, సిద్ధవటం, రైల్వేకోడూరుల్లో అటవీశాఖ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో టాస్క్‌ఫోర్స్, అటవీశాఖతో కలిసి ప్రత్యేక మాస్ కూంబింగ్ ఆపరేషన్ చేపడతామన్నారు. అటవీ చెక్‌పోస్టుల్లో తనిఖీలు పటిష్ఠంగా చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచి మళ్లీ నేరాలకు పాల్పడితే పీడీయాక్టు ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు జి.బాలిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఏసీఎఫ్‌జే శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

మహనీయుడు గురజాడ

- ప్రముఖ చర్మ వ్యాధుల వైద్యులు డాక్టర్ యుగంధర్



గెలుపొందిన టీపీపీఎం విద్యార్థులతో డాక్టర్ యుగంధర్, తదితరులు

తిరుపతి(విద్య), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు గురజాడ అప్పారావు అని అని ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు, సినీ నిర్మాత డాక్టర్ యుగంధర్ అన్నారు. ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావుపై గత నెలలో నిర్వహించి వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, శుభ్రత పాటించాలని సూచించారు. ప్రజా కళావేదిక వ్యవస్థాపకులు అరవ జయపాల్, టీపీపీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆనంద్ తదితరులు మాట్లాడారు. వ్యాసరచన పోటీల విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. 9వ తరగతి విద్యార్థిని దివ్య ప్రథమ స్థానంలో నిలిచి రూ. 516 నగదు బహుమతి అందుకున్నారు. 10వ తరగతి విద్యార్థి ముష్కాన్ ద్వితీయ స్థానంలో నిలిచి రూ.316, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థి విమలకు రూ.216లు అందించారు. కన్సోలేషన్ బహుమతులు పొందిన జ్యోతిక్, మానీష్‌లకు రూ.116ల నగదు బహుమతులను, ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు.

సంకల్ప బలం జీవిత సాఫల్యానికి మార్గం

- యువతకు వ్యక్తిత్వ వికాస నిపుణుల దిశా నిర్దేశం





జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు - మాట్లాడుతున్న ఐఏఎస్ ట్రైనర్ బాలలత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు సాధించాలనే సంకల్ప బలంతో ముందడుగు వేస్తే ప్రతి ఒక్కరి జీవితం సాఫల్యమవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు యువతకు దిశా నిర్దేశం చేశారు. డాలర్స్ గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా ఇంపాక్ట్ ఆధ్వర్యాన యువత కోసం చేపట్టిన రెండు రోజుల కార్యక్రమం మంగళవారం తిరుపతిలోని మహతిలో ప్రారంభమైంది. నిత్య ప్రయత్నం ద్వారా విజయ తీరానికి చేరుకోవచ్చని ఐఏఎస్ ట్రైనర్ బాలలత అభిప్రాయపడ్డారు. ఇందుకు స్వామి వివేకానందుడి జీవితం ఉదాహరణగా చెప్పారు. మారుమూల ప్రాంతం నుంచీ వచ్చిన తాను నిరంతర సాధనతోనే ఈ స్థాయికి చేరుకున్నట్టు తెలిపారు. మారుమూల ప్రాంతానికి చెందిన తాను అనుకున్నది సాధించాలనే లక్ష్యం ఏర్పరుచుకున్నానని నగరపాలక సంస్థ కమిషనరు మౌర్య అన్నారు. ఇందువల్ల ఐఏఎస్ అధికారిగా నిలిచానన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, సాధించాలనే లక్ష్యం ఉంటే ఎన్ని అడ్డంకులైనా అధిగమించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వరరావు పేర్కొన్నారు. నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యం కోసం పనిచేస్తే ఉజ్వల భవిష్యత్తు కలుగుతుందన్నారు. సామాన్య గ్రామీణ కుటుంబం నుంచీ వచ్చిన తాను ఈ స్థాయికి రావడం వెనుక ఎంతో కృషి ఉంది డాలర్స్ గ్రూపు అధినేత దివాకర్ రెడ్డి అన్నారు. సమాజం కోసం సంపాదనతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఓటమి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో గుణపాఠంగా నిలుస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణుకళ్యాణ్ అన్నారు. ఏ సమస్య ఎదురైనా సంయమనంతో అడుగేస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. చరిత్రలోని మహనీయులంతా నిరంతన శ్రమతోనే ఆ స్థాయికి ఎదిగారని ఇంపాక్ట్ కన్వీనర్ ఎన్.నారాయణ గుర్తు చేశారు. ఇంపాక్ట్ నిర్వహణ కమిటీ సభ్యులు తహసున్నీసా, విభీషణశర్మతో పాటు యువత పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ పెన్షనర్ల తనిఖీ

తిరుపతి అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్ణయించిన రూ. 15వేల పెన్షనర్ల ఎంపికకు సంబంధిత విభాగాల ప్రొఫెసర్లు, వైద్యుల బృందం బుధవారం మంగళం ఉమ్మడి పంచాయతీలో పర్యటించనుంది. పక్షవాతంతో మంచానికి, కుర్చీకి పరిమితమైన, ప్రమాదవశాత్తు 80శాతం వికలత్వం బారిన పడిన ఎనిమిది మందిని గుర్తించారు. వారి ఆరోగ్యపరిస్థితులను, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను పునఃపరిశీలించనున్నారు. అర్హులైతే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకానికి ఎంపిక చేయనున్నారు. బాధితులు అందుబాటులో ఉండాలని ఆయా సచివాలయ కార్యదర్శులు సమాచారం అందించారు.





షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారిణులు

రసవత్తరం.. రసరమ్యం

రెండో రోజు జోరుగా అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు



తిరుపతిరూరల్, జనవరి7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వేదికగా జరిగే 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు రెండవరోజు మంగళవారం రసవత్తరంగా సాగాయి. కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు క్రికెట్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ వంటి వివిధ క్రీడల్లో తలపడ్డారు. అలాగే ఆడిటోరియంలో నిర్వహించిన సాహిత్య పోటీలలో పలువురు విద్యార్థులు శాస్త్రీయ, జానపద, సినీగీతాలకు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. మహిళల వాలీబాల్ విభాగంలో తిరుపతి డెయిరీ టెక్నాలజీ జట్టుపై ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాలజట్టు విజయం సాధించింది. తొలిదశ బాస్కెట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్‌లో తిరుపతి వెటర్నరీ కళాశాల విద్యార్థుల జట్టు ప్రతిభచాటారు. మహిళల జావెలిన్‌త్రో విభాగంలో ఎం.సాయి తేజస్విని (ప్రొద్దుటూరు), ఎం.సుప్రియ (తిరుపతి), ఎస్.విద్య (గరివిడి) తొలి మూడుస్థానాలు సాధించారు. పురుషుల విభాగంలో ఎ.నవీన్‌కృష్ణ (గరివిడి), ఎం.వినయ్‌నాయక్(గన్నవరం), టి.చైతన్య(తిరుపతి), మహిళల షాట్‌పుట్‌లో సీహెచ్ అనుపద (ప్రొద్దుటూరు), ఎం.సుప్రియ(తిరుపతి), బి.జ్యోతిర్మయి(గరివిడి) తొలి మూడుస్థానాలు సాధించారు. పురుషుల క్యారమ్స్‌లో వరుసగా పి.శ్రీకాంత్, డి.వికాస్(గరివిడి) తొలి రెండుస్థానాలు సాధించి విజేతగా నిలిచారు. ఎం.హరికిరణ్, డి.అవినాష్ (ప్రొద్దుటూరు) రన్నర్స్‌గా నిలిచారు. మహిళల క్యారమ్స్‌లో వి.కీర్తి, ఆర్.సుమరాగిని(గరివిడి) విజేతలుగా నిలచారు. వీఆర్ నందిని, జి.తేజశ్వి (గన్నవరం) రన్నర్స్‌గా నిలిచారు. మహిళల చెస్‌లో సీవీ ధరణీలక్ష్మి (తిరుపతి), ఎం.జోషిక (ప్రొద్దుటూరు) వరుసగా తొలి రెండుస్థానాల్లో నిలవగా పురుషుల చెస్‌లో శుభం సౌరవ్ (తిరుపతి), సీహెచ్ శశికిరణ్ (గన్నవరం) ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు. ఇక 400 మీటర్ల పురుషుల పరుగుపందెంలో ఎ.నవీన్‌కృష (గరివిడి), వి.నరేంద్రబాబు (తిరుపతి), శ్రావణ్‌కుమార్‌రెడ్డి (ప్రొద్దుటూరు) వరుసగా తొలి మూడుస్థానాల్లో నిలిచారు. 500మీటర్ల పురుషుల విభాగంలో ఎన్.రాజేష్(గరివిడి), ఎం.గౌరీశంకర్(సీడీటీ తిరుపతి), బి.రాఘవేంద్ర(ప్రొద్దుటూరు)తొలి మూడుస్థానాల్లో నిలిచారు. 400 మీటర్ల మహిళల విభాగంలో ఎం.సాయితేజస్విని(ప్రొద్దుటూరు), ఎస్.ప్రణీత(గరివిడి),ఎస్.విద్య(గరివిడి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. కళాశాల అసోసియేట్‌డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య, ఓఎస్‌ఏ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.వేణు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ జయచంద్ర, ప్రొఫెసర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



అబ్బురపరచిన నృత్య ప్రదర్శనలు

కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సాహిత్య పోటీల్లో భాగంగా పలువురు విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలతో సభికులను అలరించారు. కాళ్లకు గజ్జెలు కట్టి శాస్త్రీయ, జానపద గీతాలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శనలు చేసి అబ్బురపరిచారు. త్రిశూలం చేతబట్టి దుర్గాదేవి వేషధారణలో ఓ విద్యార్థి ప్రదర్శించిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఆలయ శుద్ధి

తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ఉండటంతో.. మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించారు. టీటీడీ చైర్మన్, బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వెంటాడి.. గంజాయి వాహనం పట్టివేత

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు సినీఫక్కీలో వెంటాడి పట్టుకున్నాయి. వైజాగ్ నుంచి గంజాయితో ఓ కారు కోట మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నట్లు సమాచారం అందింది. వెంటనే పోలీసులు, టాస్క్‌ఫోర్సు బృందాలు వెంబడించడంతో గంజాయి వాహనం కడివేడు మీదుగా వెళ్లిపోయింది. కోట మండలంలోని విద్యానగర్, చంద్రశేఖర్‌పురం, చిట్టేడు, కేశవరం, కొండుగుంట మార్గాల్లో వెళుతున్న వాహనాన్ని పోలీస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు వెంటాడాయి. విద్యానగర్‌లోని పెట్రోల్ బంకు వద్ద స్థానిక యువకులు ఎక్స్‌కవేటర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో గంజాయి వాహనం ఆగిపోయింది. పోలీస్, టాస్క్‌ఫోర్స్ బలగాలు ఆ వాహనాన్ని చుట్టుముట్టి అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. ఆ కారులో సుమారు 80కిలోల గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిసింది. వివరాలు తెలియాల్సి ఉంది.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 26 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.20 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 54,180

తలనీలాలు సమర్పించినవారు: 17,689

మొక్క వోని లక్ష్యం

● గ్రీన్ మ్యాన్ గూడూరు శ్యామ్‌కుమార్‌రెడ్డి



సొంత ట్యాంకర్‌తో మొక్కలకు నీటిని పడుతున్న శ్యామ్





నరశింగరావుపేట ప్రాంతంలోని రైల్వేస్టేషన్ గోడ ఆనుకుని శ్యామ్ నాటిన మొక్కలు

మొక్కల పెంపకం ద్వారా సామాజిక బాధ్యత తను నిర్వరిస్తున్నారో వ్యక్తి. గూడూరులోని షాదీమంజిల్ సమీపాన నివాసముంటున్న మద్దాలి శ్యామ్‌కుమార్‌రెడ్డి ప్రైవేటు కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. వృత్తితోపాటు నిరంతరం తన ప్రవృత్తి కూడా నిర్వర్తిస్తున్నారీయన. 22 ఏళ్లుగా పట్టణంలోని వీధుల్లో, కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల వద్ద మొక్కలను నాటుతున్నారు. పచ్చదనం పరిరక్షణ కోసం మోడుమారుతున్న మొక్కలకు ప్రాణం పోస్తున్నారు. తానే ట్రక్కుఆటో కొని వాటర్‌క్యాన్‌లో నీటిని నింపుకుని తీసుకువెళ్లి మొక్కలకు పోసి కన్నబిడ్డల్లా సాకుతున్నారు. ఈయన నాటిన మొక్కలు ఇప్పుడు చెట్లుగా పెరిగి నీడనిస్తున్నాయి. తుపాన్లలో నేల కొరిగిన వాటినీ నిలబెట్టి ప్రాణం పోస్తూ కాలుష్యరహిత సమాజానికి తనవంతు కృషిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి మొక్కలు పెంచడం ఎంతో ఇష్టమని చెబుతారు శ్యామ్‌కుమార్‌రెడ్డి. పొగడ, కానుగ, వేప, మర్రి, నేరేడు, బాదం, దేవగన్నేరి, టెంపుల్, మారేడు తదితర ఎన్నో రకాల మొక్కలను నాటారు. మొదట్లో వెయ్యికి పైగా మొక్కలను స్వయంగా నాటి రోజూ నీరు పోసేవారు. ఈయనలోని సామాజిక దృక్పథాన్ని గమనించిన కొందరు దాతలు ముందుకొచ్చారు. మొక్కల కోసం ట్రీగార్డులను అందజేయడం ప్రారంభించారు. ఈయన ప్రయత్నానికి చేదోడుగా నిలిచారు. ఇప్పటికే 5వేలకు పైగా మొక్కలను నాటి సంరక్షిస్తున్నట్లు శ్యామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలో పచ్చదనం వ్యాప్తికి శ్యామ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు.

- గూడూరు, (ఆంధ్రజ్యోతి)





తుపానులో కూలిపోయిన టెంపుల్‌ట్రీ చెట్టును నిలబెట్టి.. ప్రాణం పోశారు ఇలా..

చెడిపోయిన మాంసం

- కుళ్లిన కూరగాయలు
- ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడుల్లో విస్తుపోయే నిజాలు
- 14 హోటళ్లలో తనిఖీలు చేసి నోటీసులు జారీ
- చర్యలు తీసుకుంటామన్న రాష్ట్ర డైరెక్టర్ పూర్ణచంద్రరావు



తిరుచానూరు వద్ద ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లలో మంగళవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 10 బృందాలుగా ఏకకాలంలో దాడులు చేశాయి. నాణ్యతా ప్రమాణాలను అధికారులు పరిలిఇంచారు. తిరుచానూరు వద్దనున్న ఓ హోటల్‌లో కుళ్లిపోయి, గడ్డకట్టిన్న మాంసాన్ని డీప్ ఫ్రిడ్జిలో ఉంచడం బయటపడింది. అనుమతుల్లేని ఎసన్స్‌లు వాడుతున్నట్లు చర్తించారు. చెడిపోయిన టమోటాలతో చట్నీ, సాస్‌ల తయారీ.. చికెన్ కబాబ్ తదితరాలను మళ్లీ వేడి చేసి కస్టమర్లకు వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇళ్లలో ఇలాగే చేస్తారా అంటూ సిబ్బందిని నిలదీశారు. రేణిగుంట రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో మూడు నెలల క్రితం కాలపరిమితి దాటిన ఊరగాయల బాటిళ్లను, చెడిపోయిన నూడుల్స్, పుట్టగొడుగులు, చికెన్ కబాబ్‌ను గుర్తించారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఓ రెస్టారెంటులోని కొన్ని ఆహార ఆహార పదార్థాలను పనిచేయక ఆహార పదార్థాల్లో రంగు, రుచి కోసం వాడుతున్న కలర్లు డూప్లికేట్‌వి గుర్తించారు. నగరంలోని మరో హోటల్‌లో కాలపరిమితి ముగిసిన రోటీలు, బ్రెడ్లు, పుట్టగొడుగులు బయటపడ్డాయి. ఇంకో హోటల్‌లో గోబీ మంజూరి, జాంగ్రీ చెడిపోయి వుందని తనిఖీ అధికారులు చెప్పారు. ఇంకో హోటల్‌లో పురుగులు పట్టిన అలసందలు, నువ్వులు, కొన్ని సీజ్ చేశారు. మరో హోటల్‌లో ఫ్రిడ్జి పదార్థాలు, పెరుగు చెడిపోయిందని, వీటిని కస్టమర్లకు ఎలా వడ్డిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగులు కలిపిన కందిపప్పు చెడిపోయిన జీడిపప్పు, పుట్టగొడుగులు ఉన్నట్లు ఇంకో హోటల్ తనిఖీల్లో బయటపడింది. ఇంకో హోటల్‌లో తిరుపతి ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి తనిఖీ చేయగా.. వండి నిల్వ వుంచిన ఆహార పదార్థాలు ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం కొన్ని హోటళ్లు, తోపుడు బండ్లపై టిఫిన్లు, వివిధ రకాల తినుబండారాలను తనిఖీ చేశారు. ఆయా తనిఖీల్లో కర్నూలు ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాలరావు, తిరుపతి నుంచి మద్దిలేటి, జగదీష్, సుమన్, చిత్తూరు నుంచి శ్రీనివాస్, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్‌కు పంపి చర్యలు తీసుకుంటాం

మా తనిఖీల్లో బయటపడిన ఆహార పదార్థాలు, ముడిసరుకులను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నాం. ప్రస్తుతం హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. ఎవ్వరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదు. ల్యాబ్‌కు పంపిన బిర్యానీ, వివిధ ముడిపదార్థాలు, సరకుల్లో లోపాలుంటే చట్టపరమైన చర్యలు ఉంటాయి. అన్ని హోటళ్లలో అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేస్తుండట్నాన సీరియస్‌గా తీసుకుంటున్నాం.

- పూర్ణచంద్రరావు, ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర డైరెక్టర్

రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన 27 రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. వీటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించామని పేర్కొన్నారు.

వినియోగదారులపై ఆర్థిక భారం తగదు



ప్రజాభిప్రాయ సేకరణలో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలపైనే ఏపీఈఆర్‌సీ ఆర్థికభారాన్ని మోపడానికి దిగడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం నేత కందారపు మురళి పేర్కొన్నారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన వర్చువల్‌గా తన వాదన వినిపించారు. ప్రజాభిప్రాయ సేకరణలు చేపట్టినా చివరకు ప్రభుత్వాల ఆదేశాలను పరోక్షంగా అమలు చేస్తోందని ఆరోపించారు. చార్జీలు పెంచడానికి ఇచ్చిన అనుమతులే ఇందుకు నిదర్శనమన్నారు. సెకీ విద్యుత్ ఒప్పందం, స్మార్ట్ మీటర్లు అమర్చడం వంటివి నియంత్రణ మండళ్ల నిస్సహాయతకు సాక్ష్యాలని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ32 వేల కోట్ల భారాన్ని మోపితే, కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో రూ.16 వేల కోట్లు భారాన్ని వినియోగదారులపై మోపడం అన్యాయమని తెలియజేశారు. ప్రభుత్వాలు 25 ఏళ్లకు ఒప్పందాలు చేసుకోవడం, ఒక యూనిట్ విద్యుత్ కూడా కొనుగోలు చేయకుండా లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఉత్పత్తిదారులకు చెల్లించడాన్ని రద్దు చేయాలన్నారు. సెకీ, అదానీల ఒప్పందాలను రద్దు చేసి తిరిగి టెండర్లను ఆహ్వానించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్‌ఈ పి.సురేంద్ర నాయుడు, ఈఈ వి.చంద్రశేఖర్ రావు, వాసవీలత, ఎస్ఏవో శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి పక్షుల పండుగ

● కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి ● విజయవంతానికి అధికారులు కృషి చేయాలని ఆదేశం



సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానాన్ని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

తడ/సూళ్లూరుపేట/దొరవారిసత్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా ఈ 18వ తేది నుంచి మూడు రోజులపాటు పక్షుల పండుగ నిర్వహించాలని నిర్ణయించామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలసి మంగళవారం ఆయన దొరవారి సత్రం మండలం నేలపట్టు పక్షుల కేంద్రాన్ని, సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప వద్ద పులికాట్ సరస్సు, వన్యప్రాణి విభాగం విజ్ఞానకేంద్రం, జూనియర్ కళాశాల మైదానం, తడ మండలం భీములవారిపాళెం పడవల రేవును పరిశీలించారు. పండుగ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రజా ప్రతినిధుల సూచనలను స్వీకరించారు. సూళ్లూరుపేటలోని ఓ కల్యాణ మండపంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోను.. పర్యటనల్లోనూ ఆయన మాట్లాడారు. నాలుగేళ్లుగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించలేదని, ఇప్పుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. 18వ తేది శనివారం శోభాయాత్రతో ఈ పండుగ ప్రారంభమవుతుందని నేలపట్టు, అటకానితిప్పల్లో పక్షులను వీక్షించడం, భీములవారిపాళెంలో పడవ షికారు, సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహిస్తామని వివరించారు శ్రీసిటీలోనూ కార్యక్రమాలు నిర్వహించేలా నిర్ణయించామన్నారు. పర్యాటకుల కోసం పడవలను సిద్ధం చేసినట్లు చెప్పారు. పర్యాటకులకు ఏర్పాట్లు చేయడానికి తన అధ్యక్షతన 16 మంది అధికారులతో పండుగ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పక్షుల పండుగ నేపథ్యంలో నేలపట్టుకు గూడూరు సబ్ కలెక్టర్, అటకానితిప్పకు డీఆర్‌డీఏ పీడీ, భీములవారి పాళెం మత్స్యశాఖ ఏడీ, శ్రీసిటీకి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, సూళ్లూరుపేట కార్యక్రమాలకు డ్వామా పీడీలను ఇన్‌చార్జులుగా నియమించామన్నారు. జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించిన ఆయన మీడియాతోనూ మాట్లాడారు. మన ప్రాంతంలో జరిగే పక్షుల పండుగను అందరి సహకారంతో విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, డీఆర్వో నరసింహులు, సూళ్లూరుపేట వన్యప్రాణి సంరక్షణశాఖ డీఎఫ్‌ఓ హారిక, టూరిజం జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి, డీపీఎం శ్రీనివాసరావు, పర్యాటకశాఖ ఆర్డీ రమణప్రసాద్, మత్స్యశాఖ ఏడీ నాగరాజు, ఆయా మండలాల అధికారులు, నేతలు పాల్గొన్నారు.

2,770 సీసీ కెమెరాల నిఘాలో వైకుంఠద్వార దర్శనాలు

● 12 వేల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు
● 9న ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు



తిరుపతిలో క్యూల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈవో గౌతమి, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, జనవరి7(ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనాలకు వచ్చే భక్తుల భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకోసం 2,770 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. తిరుపతిలో సర్వదర్శన టోకెన్లు జారీ చేసే కేంద్రాల్లోనూ 50 కెమెరాలను ఏర్పాటు చేశారు. టీటీడీ ఈవో శ్యామలరావు మంగళవారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు.

వైకుంఠద్వారదర్శనం టోకెన్లు ఇచ్చే కేంద్రాలు

తిరుపతిలో: ఇందిరామైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్‌పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జడ్పీ ఉన్నత పాఠశాల. ఈ కేంద్రాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ కేంద్రాల్ల వద్ద గూగుల్ లోకేషన్ మ్యాప్స్ ఏర్పాటు చేశారు.

తిరుమలలో : కమ్యూనిటీ హాల్‌లోని 4 కౌంటర్లలో.

వసతి ఏర్పాట్లు: పదిరోజుల పాటు తిరుమలలో వసతి ఆన్‌లైన్ బుకింగ్ రద్దు. సామాన్య భక్తులకు మాత్రం సీఆర్వోలో గదులు కేటాయిస్తారు. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తిరుమలలోని ఎంబీసీ, ఏఆర్పీ, టీబీసీ, కాటేజీ డోనార్ స్కీం అలాట్మెంట్ కౌంటర్లు మూసివేస్తారు.

పార్కింగ్: తిరుమలలో 12 వేల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఎంబీసీ, ఔటర్ రింగ్‌రోడ్డు, రాంభగీచా, పరకామణి భవనం, అర్చక నిలయంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. టికెట్లపై ఎంట్రీ పాయింట్, అలైటింగ్ పాయింట్, పార్కింగ్, పికప్ పాయింట్ల వివరాలు ముద్రిస్తారు.

ఇతర నిర్ణయాలు

● దర్శన టోకెన్లు కలిగిన భక్తులకే క్యూలైన్‌లోకి అనుమతి. ● జనవరి 9వ తేదీకి అదేరోజుకు ఇచ్చే ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ రద్దు. ● శ్రీవారిమెట్టు మార్గంలో టోకెన్ జారీ కౌంటర్లు జనవరి 19వ తేదీ వరకు మూసివేత. ● వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సులు స్వీకరించరు. ● భక్తులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా మంచినీరు, అన్నప్రసాదాల పంపిణీ. అన్నప్రసాద కేంద్రాలతో పాటు ఫుడ్‌కౌంటర్ల ద్వారా సాంబారన్నం, పాలు, టీ, స్నాక్స్, మంచి నీరు పంపిణీ. ● 3 వేల మంది యువ శ్రీవారిసేవకులు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు. ● 2,082 మంది సిబ్బందితో పారిశుధ్యం. అదనంగా 150 కేటాయింపు.

కరెంటు స్తంభాన్ని ఢీకొన్న కారు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కరకంబాడిరోడ్డులోని శ్రీనివాస రెసిడెన్సీ వద్ద మంగళవారం వేకువజామున ఓ కారు కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఆగింది. వివరాలిలా ఉన్నాయి. బంగారుపాలేనికి చెందిన ఎ.ప్రశాంత్ మంగళవారం తెల్లవారుజామున తిరుపతి నుంచి రేణిగుంటకు వెళుతున్నారు. ఆ సమయంలో కరకంబాడి రోడ్డులో కారు అదుపు తప్పి పక్కనే వున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వెనకే ఉన్న ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఆగింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జు, నుజ్జు అయింది. కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కాగా, నిద్ర.. మద్యం మత్తు వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి చెప్పారు.



చెరకు కూలీలపై దూసుకెళ్లిన కంటైనర్

● ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



చెరకు కూలీలను ఢీకొన్న కంటైనర్

నారాయణవనం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన చెరకు కట్టలు పేర్చుతున్న కూలీలపైకి కంటైనరు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ కూలీ మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. నారాయణవనం మండలంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. నైనారు కండ్రిగ వద్ద చెరకు తోటలో చెన్నైలోని విల్లుపురానికి చెందిన రాజన్(55), తనికవేలు ఉదయం 6 గంటల ప్రాంతంలో చెరకు గడలను తీసుకొచ్చి రోడ్డుపై పేర్చుతున్నారు. చెన్నై నుంచి తిరుపతి వైపుగా వస్తున్న లారీ కంటైనర్ నేరుగా వారిని ఢీకొట్టింది. పేర్చిన చెరకు గడలకు, లారీకి మధ్యలో రాజన్ నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తనికవేలు తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో యూజీసీ బృందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగాన్ని యూజీసీ బృందం పరిశీలించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం దూరవిద్య విభాగం నిర్వహణ, కోర్సులు, బోధన, విద్యార్థులు, స్టడీ మెటీరియల్, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, సిబ్బంది, పనితీరు వంటి పలు వివరాలను పరిశీలించారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. దూరవిద్యా విభాగ అభివృద్ధి, ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. దూరవిద్య పూర్వ ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సెనేట్ హాల్లో సమావేశమై పలు వివరాలను తెలుసుకున్నారు. డీఎస్సీ పర్స్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ బృందంతో ఆచార్య అశ్విని మహాపాత్ర, ఆచార్య రాజేంద్ర, ఆచార్య అరిండ్ రనడే, యూజీసీ డిప్యూటీ సెక్రెటరీ వినోద్ సింగ్ యాదవ్ ఉన్నారు. వీరికి దూరవిద్య ప్రగతిని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, దూరవిద్యా డైరెక్టర్ తవమణి వివరించారు. ఈ పర్యటన తర్వాత దూరవిద్యకు గుర్తింపును ప్రకటించే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్యను పరిశీలిస్తున్న యూజీసీ బృందం

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని నూతన అవిష్కరణలు చేపట్టి భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో సైన్స్ సిపోజియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని నూతన ఆలోచనలతో మానవాళికి ఉపయోగపడేలా కొత్త అంశాలను కనుగొనాలన్నారు. ఈ తరహా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తిని, ఆలోచనా పరిజ్ఞానాన్ని పెంపొందించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలను తిలకించి, వాటి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నవకోటి నాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు

గూడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్వీర్యం అయిన విద్యావ్యవస్థను తిరిగి గాడిలో పెట్టి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపట్టారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు వెంకటేష్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టడంతో మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్ కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, ఫలితాలను మెరుగుపరిచేందుకు, విద్యావ్యవస్థను పటిష్ట పరిచేందుకు మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారన్నారు. లల్లూ, జీవన్, ధనుష్, జయ, శ్రీను, జగదీష్, వినయ్, మురళి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

డక్కిలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మెక్కుబడిగా జరిగింది. ఉదయం 10 గంటలకు మొదలు కావాల్సిన సమావేశం కోరం లేకపోవడంతో రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. 10 గంటలకు ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి మాత్రమే హాజరయ్యారు. అధికారులు ఎంపీటీసీ సభ్యులందరికీ ఫోన్లు చేసి సమావేశానికి రావాలని కోరినా ఎవ్వరూ స్పందించలేదు. 12 గంటలకు తీర్థంపాడు ఎంపీటీసీ మెట్టుకూరు భారతి, దగ్గవోలు ఎంపీటీసీ పరందాయ్య హాజరవడంతో కోరం సరిపోయింది. దీంతో 12.20కి సమావేశం ప్రారంభం కాగానే తీర్థంపాడు ఎంపీటీ సభ్యురాలు భారతి సంతకం చేసి ఏదో పని ఉందంటూ వెళ్లిపోయారు. దగ్గవోలు ఎపీటీసీ సభ్యుడు పరుశురామయ్య కూడా కొద్దిసేపటికే బయటకెళ్లిపోయారు. మిగిలిన సభ్యులెవరూ సమస్యలపై సభలో నోరు మెదపకపోవడంతో అధికారులు శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడారు. చివరగా ఎంపీపీ గోను రాజశేఖర్ మాట్లాడుతూ పార్టీల కతీతంగా అభివృద్ధికి కృషి చేద్దామని చెప్పి సభను ముగించేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో రోడ్లన్నీ దెబ్బతిని, పారిశుధ్యం క్షీణించి జనం జ్వరాలతో బాధపడుతున్నారు. మరోవైపు గ్రామాల్లో మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అయితే ప్రజాప్రతినిధులు మాత్రం తమకేమీ పట్టనట్లు మండల సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.

పడిపోయిన వెనామి ధరలు

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పండుగలు వచ్చే సమయానికే ఏటా రొయ్యల ధరలు పడిపోవడం పరిపాటిగా మారింది. సంక్రాంతి పండుగలు వారం రోజులు ఉండగా వేనామి రొయ్యల ధరలు తగ్గిపోయాయి. చెన్నై, నెల్లూరు, కడలూరు, పాండిచ్చేరి, రొయ్యల మార్కెట్లలో ధరలు పడిపోయాయని బయ్యర్లు ప్రచారం చేయడంతో కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో రొయ్యల విక్రయాలు ఆగిపోయాయి. మంగళవారం నాటికి 270 ఉన్న 100 కౌంట్ రొయ్య రూ.240, 90 కౌంట్ ఉన్న రొయ్య రూ.250, 80 కౌంట్ ఉన్న రొయ్య రూ.270 70 కౌంట్ ఉన్న రొయ్య రూ.310, 60 కౌంట్ ఉన్న రొయ్య రూ.340, 50 కౌంట్ ఉన్న రొయ్య రూ.360 40 కౌంట్ రొయ్య రూ.390కు పడిపోయాయి. ఒక్కోక్క రొయ్య కౌంట్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు వెనామి రొయ్యల ధరలు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటూ గుండెలు బాదుకుంటున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

రాగివైరు అపహరణ

పెళ్లకూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నప్ప నాయుడుపేట గ్రామానికి చెందిన రైతు నలుగూరు విద్యాసాగర్ పొలాల్లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులో ఉన్న రాగివైరుతో పాటు ఆయిల్‌ను అపహరించుకుని వెళ్లారు. బాధిత రైతు మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పక్షుల పండుగ గుర్తుండేలా

సూళ్లూరుపేటను అభివృద్ధి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, వేదికపై ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, డీఆర్వో నరసింహులు, డీఎఫ్‌వో హారిక తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా నిర్వహించే పక్షుల పండుగ గుర్తుండేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందకు కలెక్టర్ చొరవతీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌కేఎస్ కల్యాణ మండపంలో పక్షుల పండుగ నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో నరసింహులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పక్షుల పండుగను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ వాకాటి మాట్లాడుతూ సూళ్లూరుపేట మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదని, డివైడర్ల మధ్యలో ఉన్న చెట్లను తొలిగించారని, పక్షుల పండుగ లోపు డివైడర్ల నడుమ మొక్కలు నాటే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. పక్షుల పండుగ గుర్తుండేలా అభివృద్ధి పనులు చేయాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ మున్సిపాలిటీలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ పండుగకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచ్చేసే అవకాశమున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. పులికాట్ సరస్సు ప్రాంతాల్లో ఉన్న వేనాడు, కొరిడి-పేర్నాడు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేసేందుకు కలెక్టర్ చొరతీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రణాళిక బద్ధంగా పక్షుల పండుగ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకొంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, డీఎఫ్‌వో హారిక, టూరిజం అధికారి జనార్దనరెడ్డి, తహసీల్దార్ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: జేసీ శుభం భన్సల్



సదస్సులో మహిళ ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న జేసీ శుభం భన్సల్

ఓజిలి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ అన్నారు. ఓజిలి మండలం పున్నేపల్లిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భూ ఆక్రమణలు ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. అందులో భాగంగానే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని, భూములకు రక్షణ కల్పించేలా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు ప్రజల వద్దకు వెళ్లి వారి భూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు జేసీ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఆర్ఐ విజయకుమార్, వీఆర్వో దిలీప్, టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, నెమళ్లపూడి నాయకులు కొప్పల మునిరాజ, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్ఆర్ ట్రేడర్స్ ముందు ఆందోళన చేస్తున్న బాధితులకు నచ్చచెబుతున్న పోలీసులు

ఆఫర్ల పేరుతో ఘరానా మోసం

రూ.లక్షలు కట్టించుకొని పరార్



ఆర్ఆర్ ట్రేడర్స్ దుకాణానికి తాళాలు వేసి ఉన్న దృశ్యం

కోట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏ వస్తువు కొన్నా సగం ధరకే ఇస్తామని, ఆ వస్తువులను ఇంటికే తీసుకొనివచ్చి డెలివరి చేస్తామని ఓ సంస్థ నమ్మబలికింది. ఆఫర్లలో చవకగా వచ్చే వస్తువుల కోసం ఆశపడిన ప్రజలు పోటాపోటీగా వేల రూపాయల చొప్పున చెల్లించిన నెల రోజులకే బోర్డు తిప్పేసిన సంఘటన కోట పట్టణంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.... చెన్నైకు చెందిన ఆర్ఆర్ ట్రేడర్స్ అండ్ ఆర్డర్స్ సంస్థ కోట పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో రెండు దుకాణాలతో ఫర్నిచర్ వ్యాపారం ప్రారంభించింది. చెన్నై కేంద్రంగా వ్యాపారం చేసే తమ దుకాణాల్లో ఏ వస్తువు కొనుగోలు చేసినా సగం ధరలకే ఇస్తామని ప్రచారం చేసింది. దీంతో కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన వందలాది మంది వేల నుంచి లక్షల్లో డబ్బులు కట్టారు. పది రోజులకే కొంతమందికి చెప్పిన సమయానికి వస్తువులు అందజేశారు. రెండు రోజుల నుంచి కోటలోని ఆర్ఆర్ దుకాణాలకు తాళాలు వేసి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మోసపోయామన్న అనుమానంతో దుకాణం వద్దకు చేరుకుని లబోదిబోమంటూ గుండెలు బాదుకున్నారు. డబ్బులు కట్టిన వారంతా ఒక్కసారిగా దుకాణం వద్దకు చేరుకోవడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఫిర్యాదు చేస్తే నిర్వాహకుల మీద కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారు.

పడవ కాలువల పూడికతీత నిధులు మంజూరుకు కృషి

తడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పడవ కాలువల్లో పూడికతీతకు సంబంధించి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి భీములవారిపాళెం పడవలరేవును సందర్శించిన కలెక్టర్‌ను స్థానిక నాయకులు, గ్రామస్తులు కలిసి సమస్యలను వివరించారు. పడవ కాలువల పూడిక తీయించాలని, హైవే నుంచి పడవల రేవు వరకు రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటన్నింటికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. తిరిగి వెళ్తూ జాతీయ రహదారి పక్కన ఇబ్బడిముబ్బడిగా చెత్తా చెదారం పడేయడంపై ఎంపీడీవో విజయకుమార్‌ను ప్రశ్నించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసేవారిని గుర్తించి రూ.2 లక్షల వరకు జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎడీ నాగరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీపీ కొలవి రఘురెడ్డి, టీడీపీ నాయకులు బొమ్మన శ్రీధర్, సెల్వం, పళణి, సుధాకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

వేనాడు రోడ్డుకు మరమ్మతులు చేయించండి

అటకానితిప్ప - వేనాడు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించాలని వేనాడు గ్రామస్తులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. అటకానితిప్పకు వచ్చిన ఆయనకు వేనాడు రోడ్డు దుస్థితి గురించి వివరించారు. స్పందించిన కలెక్టర్ రోడ్డును పరిశీలించారు. మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకుడు సుదర్శన్ తదితరులు ఉన్నారు.

పుత్తూరు వార్తలు

గో బ్యాక్ నరేంద్రమోదీ: సీపీఎం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పుత్తూరు టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గో బ్యాక్ అంటూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయడం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా నేడు రాష్ట్రానికి వస్తున్న ప్రధానమంత్రి మోదీ గో బ్యాక్ అన్నారు. సీపీఎం నాయకులు విజయ్, సుబ్రమణ్యం, హరీష్, కృష్ణమూర్తి, వెంకటేష్, కందస్వామి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

- సర్వే నిర్వహించిన మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు



ఎన్జీవో కాలనీలో రోడ్డు ఆక్రమణలను సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

పుత్తూరు అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో రోడ్డు ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం 30 అడుగుల రోడ్డులో ఆక్రమణలను సర్వే ద్వారా గుర్తించారు. పుత్తూరు - కార్వేటినగరం రోడ్డు నుంచి ఎన్జీవో కాలనీ, శ్రీచైతన్య స్కూలు, జనజ్యోతి స్కూలు, మార్కెట్ రోడ్డు మీదుగా పుత్తూరు - నగరి రోడ్డు వరకు 2 కిలోమీటర్ల మేర సర్వే నిర్వహించారు. ఆక్రమణలను గుర్తించి త్వరలో తొలగింపునకు చర్యలు చేపడతామని మున్సిపల్ అధికారులు తెలిపారు. 2 నుంచి 5 మీటర్ల వరకు రోడ్డు ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు.

జాతీయ అంధుల ఫుట్‌బాల్ క్రీడాకారుల అంధత్వ పరీక్ష నిర్వహణకు పుత్తూరు వాసి ఎంపిక



బాలాజీ

పుత్తూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే అంధుల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల అంధత్వ పరీక్ష నిర్వహణ బాధ్యతలకు మెడికల్ క్లాసిఫైర్‌గా పుత్తూరుకు చెందిన బాలాజీని ఏబీపీఏ అసోసియేషన్ ఎంపిక చేసింది. ఈనెల 23 నుంచి 26 వరకు బెంగళూరులో వివిధ రాష్ట్రాల టీమ్‌లు పాల్గొంటాయి. ఈ సందర్భంగా 22వ తేదీన అంధత్వ శాతాన్ని బ్లాగ్‌మార్గ్ పద్ధతిలో పరీక్ష చేసే బాధ్యతను బాలాజీ నిర్వహించాల్సి ఉంది. తిరుపతి మెడికల్ కళాశాలలో డీవోఏ కోర్సును పూర్తి చేసిన బాలాజీ ప్రస్తుతం తిరుపతిలోని ఓ ప్రైవేట్ పారామెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. గత ఏడాది అక్టోబరులో గుజరాత్‌లో జరిగిన జాతీయ అంధుల ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కూడా ఆయనే పరీక్షలు చేశారు.

మెటల్ రోడ్డుకు మరమ్మతులు



వడమాలపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలినాయుడు కండ్రిగ వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. తడుకు ఆర్ఎస్ నుంచి కుప్పం బాదూరుకు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డులో బాలినాయుడు కండ్రిగ వద్ద వంద మీటర్లకు పైగా రోడ్డులో గుంతలు ఏర్పడటంతో పలువురు కిందపడి గాయాలపాలయ్యారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ చొరవతో డీఈ అమర్నాథ రెడ్డి రోడ్డును పరిశీలించారు. మంగళవారం జేసీబీతో కాలువల ద్వారా నిల్వ ఉన్న నీటిని తరలించారు. గుంతలు పూడ్చి మరమ్మతులు చేయించారు. టీడీపీ నాయకులు సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోగస్ పెన్షన్లపై వైద్య బృందం విచారణ

- విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగు
- పుత్తూరు అర్బన్‌లో 28 మందిలో ఒకరు మృతి
- రూరల్‌లో 14 మందికి ఇద్దరు మాత్రమే అర్హులు



వైద్యుల బృందం విచారణకు ఇంటి వెలుపల నిలుచుని సమాధానం ఇస్తున్న రమేష్ ఆచారి

పుత్తూరు అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవాని నగర్‌కు చెందిన రమేష్ ఆచారి అనే వ్యక్తి పక్షవాతంతో మంచానికి, వీల్‌ఛైర్‌కు పరిమితమైనట్లు 2020 ధ్రువీకరణ పత్రం పొంది ప్రతి నెలా రూ.15 వేలు వంతున నేటి వరకు పెన్షన్ పొందుతున్నాడు. బోగస్ పెన్షన్ల ఏరివేతలో భాగంగా విచారణకు వచ్చిన వైద్య బృందం ఆరోగ్యంగా ఉన్న రమేష్ ఆచారిని చూసి విస్తుపోయారు. పుత్తూరు అర్బన్, రూరల్ పరిధిలో బోగస్ పెన్షన్లు పొందిన వారిని గుర్తించేందుకు వైద్య బృందం మంగళవారం విచారణ చేపట్టారు. మంచానికి, వీల్‌ఛైర్‌కు పరిమితమైన 28 మందిని విచారించనున్నారు. బృందం సభ్యులైన డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ రేణుకాదేవి, స్థానిక వైద్యులు డాక్టర్ కేఆర్ రమేష్, జి.పి.ఆశలు పెన్షన్‌దారుల ఇళ్లకు నేరుగా వెళ్లి 18మందిని విచారించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బోగస్ సర్టిఫికెట్లతో నెలకు రూ.15 వేలు పెన్షన్ పొందుతున్న వారిని గుర్తించినట్లు వివరించారు. పుత్తూరు రూరల్ పరిధిలో 14 మంది ఉండగా, వీరిలో ఇద్దరు మాత్రమే రూ.15 వేలు పెన్షన్ పొందేందుకు అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలుస్తోంది. అర్బన్‌లో కూడా 28 మందికి గాను ఒకరు మృతి చెందారని తెలిపారు. బుధవారం కూడా డాక్టర్ల బృందం పెన్షన్‌దారులను విచారించనున్నారు.

తడుకుపేట పరిణామం బాధాకరం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్‌బాబు

పుత్తూరు అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నగరి రూరల్ మండలం తడుకు పేట పంచాయతీలో గత వారం రోజులుగా జరుగుతున్న పరిణామాలు బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ వీడియోను రిలీజ్ చేశారు. గ్రావెల్ సమస్యతో ఘర్షణలు చోటుచేసుకున్నాయని ఓ నాయకుడు చెప్పాడని అన్నారు. గ్రావెల్ తవ్వించింది ఎవరు.. ఎవరు తీసుకెళ్లారు.. ఘర్షణ ఎందుకు వచ్చిందన్న కోణాల్లో విచారణ చేపట్టారా అని ప్రశ్నించారు. తడుకుపేట ఘర్షణలో లా అండ్ ఆర్డర్ నిర్వహణలో పోలీసులు వైఫల్యం చెందారని విమర్శించారు. సోమవారం వంశీ అనే టీడీపీ కార్యకర్తపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. కొందరిపై హత్యా యత్నం కేసు, టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి రెండు మూడు రోజుల్లో అరెస్టులు చేయడం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. తడుకు పేట పరిణామాన్ని, పోలీసుల ఓవరాక్షన్‌ను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని స్పష్టంచేశారు. ఇప్పటికైనా పోలీసుఅధికారులు స్పందించి ఈపరిణామాలకు కారణమైన పోలీసుఅధికారిపై చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లా అధ్యాపకుల సంఘంలో పుత్తూరు వాసుల ఎంపిక



అధ్యక్షుడు నరసింహులు, కోశాధికారి మన్యం నరసింహులు

పుత్తూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల జిల్లా సంఘంలో పుత్తూరు కళాశాలకు చెందిన నరసింహులు అధ్యక్షుడిగా, మన్యం నరసింహులు కోశాధికారిగా ఎంపికయ్యారు. సంఘానికి 2025-2027కు సంబంధించి ఆదివారం తిరుపతిలో ఎన్నికలు జరిగాయి. ఈసందర్భంగా ఎన్నికైన నాయకులకు కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. మిగిలిన కార్యవర్గంలో కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నరసింహవర్మ, సహాయకార్యదర్శిగా కోటేశ్వరరావులు ఎంపికయ్యారు.

కిశోర బాలికలు జాగ్రత్తగా వ్యవహరించాలి

వడమాలపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ ఇతరత్రా జాగ్రత్తగా వ్యవహరించాలని సైకాలజిస్ట్ గుణశేఖర్ చెప్పారు. వడమాలపేటలో కిశోర వికాసం కార్యక్రమంలో మండల స్థాయిలో శిక్షకులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రోజారమణి, మనిలా, తహసీల్దార్ జరీనా, వెలుగు ఏపీఎం మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న

పొరుగువారికి సాయం చేయండి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఈ

పుత్తూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న ఇరుగుపొరుగు వారి సమస్యలను కూడా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని పుత్తూరు ఆపరేషన్ డీఈ దేవదానం ఆశీర్వాదం అన్నారు. స్థానిక విశ్రాంత భవనంలో మంగళవారం విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల డివిజన్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలతో పాటు సమాజంలో వివిధ విద్యుత్ సమస్యలతో ఇబ్బంది పడే వారి విషయాలను పరిష్కరించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు పంపే మెడికల్ బిల్లుల పరిష్కారంలో జాప్యంతో పాటు చాలా తక్కువ మొత్తాలను మంజూరు చేస్తున్నారని విశ్రాంత ఉద్యోగులు డిస్కం నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. 70 ఏళ్లు పూర్తి చేసుకున్నఏడుగురు ఉద్యోగులను, సంఘ భవన నిర్మాణానికి రూ.50వేల వంతున వితరణ ప్రకటించిన మల్లిరెడ్డి, శేఖర్‌లను సన్మానించారు. డివిజన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి భాస్కర్, కోశాధికారి శ్రీహరి, డిస్కంనాయకులు కెఎన్‌చారి, వేణుగోపాల అయ్యర్, చంద్రశేఖర్, గుణాలన్, ప్రభావతి, బాలకృష్ణ, గుంగులశెట్టి పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

పుత్తూరు టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని పుత్తూరులో మంగళవారం ఆశావర్కర్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆశా వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యులకు వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమావతి, మారమ్మ, స్వర్ణ, మునిషా, ప్రమీల, సీతారాధ పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

రైల్వేస్టేషన్‌లో బాలింత మృతి



నాగలక్ష్మి మృతదేహం

నాయుడుపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై బాలింత నాగలక్ష్మి(27) మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.... పట్టణంలో తుమ్మూరులో నివాసం ఉంటున్న నాగలక్ష్మి నెల క్రితం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్యం చేయించుకునేందుకు భర్త కిష్టయ్య, బిడ్డతో కలిసి సోమవారం సాయంత్రం నెల్లూరుకు బయలుదేరారు. వీరు నాయుడుపేట రైల్వేస్టేషన్‌కు చేరుకునే సమయానికి రైలు వెళ్లిపోయింది. దీంతో భార్య, భర్తలు, బిడ్డ రాత్రిపూట రైల్వేస్టేషన్‌లో నిద్రించారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి నాగలక్ష్మి మృతి చెంది ఉండడంతో భర్త కిష్టయ్య కన్నీరుమున్నీరయ్యారు. నాగలక్ష్మి మృతదేహాన్ని రైల్వే పోలీసులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖ వస్త్ర వ్యాపారి దొంతు వెంకటేశ్వర్లు మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్‌ఫొటో)

వెంకటగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరికి పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి దొంతు వెంకటేశ్వర్లు(70) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. వెంకటేశ్వరావు మృతి చెందారని తెలుసుకొన్న పలురు ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఫోన్‌లో వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆరుగురు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

దొరవారిసత్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.13 కోట్ల ఉపాధి పనుల్లో సిబ్బంది అవినీతికి పాల్పడడంపై డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వార్షిక సామాజిక తనిఖీ నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్లు షమీఉల్లా, కోటేశ్వరరావు, మునీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు చిట్టిబాబు, వెంకటేశ్వర్లు, ధనుంజయను సస్పెండ్ చేశారు. రూ.7.75 లక్షల రికరీ చేయాలని ఆదేశాలిచ్చారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ముందస్తుగా నిధులు మంజూరు చేయడం, రికార్డులు సక్రమంగా నమోదు చేయకపోవడంపై పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లను మందలించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, సోషల్ ఆడిట్ విభాగం ఎస్ఆర్‌పీ రవి, ఎంపీడీవో గోవర్ధన్, ఏపీవోలు భాస్కరయ్య, ఉషా, భాస్కర్ పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం కళాశాలలో విక్రమ సింహపురి యూనివర్సిటీ అంతర కళాశాలల క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణరాజు, అమ్మాజీ, రవీంద్రబాబు, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా మనోన్మణి ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న గొబ్బి దేవత

శ్రీకాళహస్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం వేదక్తంగా మనోన్మణి(గొబ్బెమ్మ) ఉత్సవం నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరం అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించగా, భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే సత్కారం



అంజలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

పిచ్చాటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డు అందుకున్న అంజలిని ఎమ్మెల్యే ఆదిమూలం మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణకు మెరుగైన సేవలు అందించి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అంజలి రాష్ట్ర స్థాయి ఉత్తమ మహిళా రైతు పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో అంజలికి పిచ్చాటూరులోని టీచర్స్ కాలనీలో ఎమ్మెల్యే శాలువ కప్పి గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గానికి చెందిన అంజలికి రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డు రావడం మనందరికీ గర్వకారణమన్నారు. అంజలిని ఆదర్శంగా తీసుకుని రైతులంరూ ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు సమస్య పరిష్కారం



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాళహస్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవతో దీర్ఘకాలికంగా ఉన్న రోడ్డు సమస్యకు మంగళవారం పరిష్కారం లభించింది. తొట్టంబేడు మండలం పూడి - ఇలగూరు మధ్య రోడ్డు నిర్మించాలని చాలా కాలంగా ప్రతిపాదన ఉంది. వైసీపీ హయాంలో రాజకీయ కారణాలతో ఈ రోడ్డు వేయకుండా ఆ పార్టీవారు అడ్డుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి గెలిచిన తరువాత స్థానికులు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన సూచనమేరకు తొట్టంబేడు రెవెన్యూ, పోలీసు అధికారులు, పాలసరఫరా సంఘం మాజీ చైర్మన్ మునిరాజా నాయుడు పూడి - ఇలగనూరు రైతులతో చర్చించారు. రోడ్డు నిర్మాణం గురించి వివరించి, సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు రైతులు అంగీకరించారు. దీంతో పూడి-ఇలగనూరు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. దీర్ఘకాలిక రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ ద్రోహి మోదీ గోబ్యాక్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏపీకి ద్రోహం చేసిన మోదీ గోబ్యాక్ అంటూ సీపీఎం నాయకులు మంగళవారం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయడాన్ని ఆపాలంటూ కార్మికులు పోరాటాలు చేస్తుంటే పట్టించుకోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిట్టల్ స్టీల్ పరిశ్రమకు చేయూతనిచ్చేందుకు విశాఖ వస్తుండటం సిగ్గుచేటన్నారు. రాయలసీమలో వేలాది ఎకరాలు ఆదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం సిద్ధమైనా నిలదీయలేని పరిస్థితిలో ప్రతిపక్ష వైసీపీ, అధికార కూటమి పార్టీలు ఉన్నాయన్నారు. దీనిపై సీపీఎం పోరాడుతుందని తెలిపారు. అంగేరి పుల్లయ్య, గురవయ్య, కుమార్, రాధమ్మ, వెంకటేష్, లాల్ బాషా, రషీద్, అన్వర్‌బాషా, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

● రేణిగుంట (ఆంధ్రజ్యోతి): ఏపీలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ విభజన హామీలను నెరవేర్చని ప్రధాని ఏపీ పర్యటనకు టీడీపీ, జనసేన రెడ్‌కార్పెట్ పరచడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గో బ్యాక్ మోదీ అంటూ నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● సత్యవేడు (ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు, వెనుకబడిన రాయలసీమకు నిధులు, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు విశాఖలో ఎలా పర్యటిస్తారని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ప్రశ్నించారు. స్థానిక సీపీఎం కార్యాలయ ఆవరణలో ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి మోదీ గో బ్యాక్ అంటూ ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. నాయకులు మునిరాజా, మునస్వామి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముడియూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్



స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పిచ్చాటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడియూరు గ్రామ సచివాలయం హెల్త్ క్లినిక్ వద్ద మంగళవారం పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, బీపీ, షుగర్ టెస్టులను నిర్వహించగా, ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. వైద్య శాస్త్ర నిపుణులు స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ క్యాన్సర్‌ని ప్రథమ దశలో గుర్తిస్తే నివారణ సులభం అవుతుందని చెప్పారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో పింక్ బస్ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించి, ఆ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా స్విమ్స్ ఆస్పత్రి ద్వారా వైద్యం చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్లు హమీద్, మునిచంద్రిత, సూపర్‌వైజర్ శాంతి, వైద్య సిబ్బంది హిమశ్రీ, లీల, శోభ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

వరదయ్యపాళెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఏఐటీయూసీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వాణి మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, పుట్టిన బిడ్డలకు ఆశా వర్కర్లు సేవలందిస్తున్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలని తెలిపారు. పదోన్నతులు కల్పించి పనిభారం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి, శశిరేఖ, లక్ష్మీకళ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వెండి పుష్పాల వితరణ



వెండి పుష్పాలు అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి నెల్లూరు సోమశేఖరపురానికి చెందిన ఈవీఎస్ గురుప్రసాద్, సి.సుధాకర్ భానుప్రసన్న జ్ఞాపకార్థం రూ.2.90లక్షలు విలువ గల 120 వెండి పుష్పాలు(2.5కేజీలు) వితరణ చేశారు. ఆలయ అధికారులు వాటిని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వేద పండితులు దర్శన ఏర్పాట్లు చేసి వేదాశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీ



బీరువాలోని వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణం హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ గోపీ కథనం మేరకు.. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన కృష్ణారెడ్డి ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తుంటాడు. ఆయన భార్య సుబ్బలక్ష్మి గృహిణి. సోమవారం దంపతులు ఇంటికి తాళం వేసి సొంత పనుల నిమిత్తం ఊరికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని 72 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఉదయం ఇంటికి చేరుకున్న బాధితులు చిందరవందరగా ఉన్న వస్తువులను చూసి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. వన్‌టౌన్ సీఐ గోపీ ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు.

15 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రేణిగుంట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు ప్రాంతాల్లో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి 15 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. చెంగల్‌రెడ్డిపల్లి, పట్టణంలోని బుగ్గవీధిలోని ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ రెండు ప్రాంతాల్లో దాడులు చేశారు. పేకాడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.16వేల నగదును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

లక్ష్మీధర్ కుటుంబానికి న్యాయం చేయండి



ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డితో మాట్లాడుతున్న మురళీ నాయుడు

శ్రీకాళహస్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన తొట్టంబేడు మండలం గుండేలి గుంట పంచాయతీ కొత్త కండ్రిగకు చెందిన తొండు సురేష్ కుమారుడు లక్ష్మీధర్ కుటుంబానికి న్యాయం చేయాలని టీడీపీ తొట్టంబేడు మండలాధ్యక్షుడు గాలి మురళీ నాయుడు ఆర్డీవోను కోరారు. మంగళవారం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డిని కలిసిన మురళీ నాయుడు మాట్లాడుతూ లక్ష్మీధర్ గత నెల 15న స్నేహితులతో కలిసి సమీపంలోని వాలగలమంద కాలువలో ఈతకు వెళ్లి మృతి చెందాడని చెప్పారు. అతడి కుటుంబానికి సాయం చేయాలని విరూపాక్షిపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కూడా విన్నవించినట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మీధర్ కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను ఆదేశించారని, ఈ మేరకు అతడి కుటుంబానికి త్వరగా న్యాయం చేయాలని కోరారు. ఇందుకు ఆర్డీవో సానుకూలంగా స్పందించారు. జనమాల గురవయ్య, తొండు గురవయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐని సన్మానిస్తున్న కోటయ్య

బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు గిరిజన బాల్య వివాహాలను అడ్డుకున్న ఎస్‌ఐ విశ్వనాథ నాయుడిని రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో దుశ్శాలువా కప్పి సన్మానించారు. కోటయ్య మాట్లాడుతూ విద్యలేని కారణంగా అనేక గిరిజన కాలనీల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై అవగాహన కల్పించినప్పటికీ వారిలో మార్పురాలేదన్నారు. ఇటీవల మండలంలోని రెండు గిరిజన కాలనీలలో బాల్యవివాహాలను ఎస్‌ఐ అడ్డుకున్నారని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే చొరవతో తీరిన లోవోల్టేజీ సమస్య



ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

శ్రీకాళహస్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారమ్మ గుడి కాలనీ, కైలాసగిరికాలనీ ప్రజలు లోవోల్టేజీ సమస్యతో చాలా ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని వారు కోరగా, స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. వారు మంగళవారం ఆ ప్రాంతంలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్, కరెంటు పోల్స్ నాటించి లైన్ లాగారు. స్థానికులు మాట్లాడుతూ గతంలో సమస్యలపై అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. చెప్పిన వెంటనే ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించారంటూ ఆయనకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

నారాయణవనం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అరణ్యం కండ్రిగలో ఉద్యాన అధికారిణి వెంకట సౌజన్య మంగళవారం మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పూతలు రావడానికి పొటాషియం నైట్రేట్ లేదా మల్టీ-కే లేదా 13.045 మందు పది గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీచేయాలని, సూక్ష్మపోషకాలు (ఫార్ములా-4) మందు 5గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ప్రారంభానికి నోచుకోని టీటీడీ కల్యాణ మండపం



టీటీడీ కల్యాణ మండపం

శ్రీకాళహస్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్యాణ మండపం ఐదేళ్ల నుంచి ప్రారంభానికి నోచుకోవడంలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయ వీఐపీ గేటు వద్ద గతంలో టీటీడీ కల్యాణ మండపం ఉండేది. సుమారు పదేళ్ల క్రితం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ తొలగించారు. ఆ తరువాత 2017లో శ్రీకాళహస్తి పట్టణ శివారు ఊరందూరు వద్ద టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రతిపాదన చేశారు. అక్కడ స్థలం కూడా కేటాయించడతో 2018లో నిర్మాణ పనులు ప్రారంభించారు. 2019లో కల్యాణ మండపం పనులు తుదిదశలో ఉండగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత కల్యాణ మండప ప్రహరీ నిర్మాణ పనులు మరుగున పడ్డాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో గత వైసీపీ పాలనలో ప్రహరీని పూర్తి చేశారు.. కానీ ప్రారంభోత్సవాన్ని అటకెక్కించారు. ఇలా ఐదేళ్లనుంచి కల్యాణ మండపం ప్రారంభం కాకుండా కాలయాపన జరిగింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి టీటీడీ కల్యాణ మండపాన్ని ప్రారంభించాలని శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించండి



కాగితాల అరుంధతివాడలో స్తంభించిన మురుగునీరు



జాతీయ రహదారి పక్కన నిరసన తెలుపుతున్న కాగితాల అరుంధతివాడ వాసులు

శ్రీకాళహస్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న తమ కాలనీకి సర్వీసురోడ్డు నిర్మించాలని శ్రీకాళహస్తి పట్టణ శివారులోని కాగితాల అరుంధతివాడ స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కాలనీ వద్ద తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ కాగితాల అరుంధతివాడలో సుమారు వంద కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారని చెప్పారు. తమ కాలనీకి ఆనుకుని జాతీయ రహదారిని ఎత్తుగా నిర్మించడంతో కాలనీలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని వాపోయారు. డ్రైనేజీ నీరు వెళ్లే మార్గం లేక స్తంభించిపోవడంతో భూగర్భ జలాలు కలుషితమై వ్యాధులు వెంటాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సర్వీసు రోడ్డు కూడా కాలనీ వద్ద నిర్మించకపోవడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదన్నారు. సమీపంలో జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. పిచ్చాటూరు మండలం టీచర్స్ కాలనీలో ఉన్న ప్రెస్‌క్లబ్ ఆఫ్ పిచ్చాటూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను అభివృద్ధి పథంలో నడిపించడంలో మరిచిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా ఎదగాలని వారికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే స్థానిక కూటమి నాయకులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పిచ్చాటూరు మండల క్లస్టర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు అరుల్‌ప్రకాష్, వాసురెడ్డి, చిన్న, ఎం.ఎస్.రవి, రజని పాల్గొన్నారు.

త్వరలో పీహెచ్‌సీకి సిబ్బంది

వరదయ్యపాళెం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం పీహెచ్‌సీలో త్వరలో సిబ్బందిని భర్తీ చేస్తామని వైద్యాధికారి ద్వైత తెలిపారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బీజేపీ నాయకుడు గుత్తి త్యాగరాజు వరదయ్యపాళెం పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న ఎంపీహెచ్‌ఎస్, ఎఫ్ఎన్ఓ, స్టాఫ్ నర్సు, ఇందిరానగర్ సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. దీనిపై మంగళవారం వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిని త్యాగరాజు కలిశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులపై డీఎంహెచ్‌వో కార్యాలయం స్పందించిందని చెప్పారు. డీఎంహెచ్‌వోకు డిసెంబరు చివరి వారంలో నివేదిక పంపామని, కడప ప్రాంతీయ సంచాలకులు ఖాళీలపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మధుసూదన్, ఫార్మసిస్టు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల అందజేత



వాలీబాల్ కిట్ అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బృందావనకాలనీ యువతకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి వాలీబాల్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల మక్కువ పెంచుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆంటోని, చందు, శంకర్, నాగరాజు, అరుణ్, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉరుసు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రేణిగుంట, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బుగ్గవీధిలోని కరుమారియమ్మ ఆలయం ఎదుట వున్న ఖానఖా-ఎ-గరీబ్‌నవాజ్ ఆశ్రమంలో మంగళవారం రాత్రి రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో వున్న హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ 813వ వార్షిక ఉరుసు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో మతగురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. నిర్వాహకులు, మతగురువులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

శ్రీకాళహస్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం రామాపురం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీ ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దారు లక్ష్మీనారాయణకు సీపీఐ నేత మించల శివకుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం రామాపురం పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు లక్ష్మీనారాయణను కలిసి విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు మాట్లాడుతూ కొంత మంది రైతులకు అటవీశాఖ అధికారులు ఇస్తున్న నోటీసులను భయపడకుండా తీసుకుని, వివరణ ఇవ్వాలని సూచించారు. ఇటీవల ఆదవరం బ్లాక్ నెంబరు 4లో ఉన్న భూముల విషయంపై అటవీఅధికారులు రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 65 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయ, రెవెన్యూ, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

● పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పిచ్చాటూరు పంచాయతీ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలు సమస్యలపై తహసీల్దార్ రమేష్‌బాబుకు రైతులు అర్జీలిచ్చారు. కార్యక్రమంలో సదస్సులో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ప్రాజెక్టు చైర్మన్ రవిరెడ్డి, చిన్నారాయల్ పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన కల్పించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

కేవీబీపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి కిశోర బాలికలకు పెరుగుదలలో ఎదురయ్యే సమస్యలను గురించి అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శోభారాణి చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల బాల్య వివాహాలు, అక్రమ రవాణా, వేధింపులు, రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత, సఖి ఉమెన్ హెల్ప్‌లైన్ 181 తదితర విషయాలపై అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ మహిళా పోలీసులు, వెల్ఫేర్ అధికారులు, విద్యాశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు లక్ష్మీపతి, రవికుమార్, ఎంపీడీవో రాధారాణి, ఏపీఎం చంద్రకళ, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ప్రజాప్రగతి సంస్థ వేణు, సీఆర్పీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుమతి, కల్పలత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టి కిశోర బాలికల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ పుస్తకాలు మోయాల్సిన వయస్సులో ఆడపిల్లలకు పుస్తెల భారం తగదన్నారు. సీడీపీవో దేవకుమారి, ఎస్‌ఐ విశ్వనాథం, ఎంఈవో మునిసుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ రాజశేఖర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వెలుగు ఏపీఎం మునెయ్య, ప్రజాప్రగతి మండల కోఆర్డినేటర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో

సత్యవేడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 2025 నూతన క్యాలెండర్లను ఆ సంఘం స్టేట్ కౌన్సిలర్ కోటీశ్వరం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో రవి చేతుల మీదుగా ఆవిష్కరించారు కార్యక్రమంలో ఎంఈవో 2 ఉష, మండల ప్రధానకార్యదర్శి మునిరాజా, అధ్యక్షుడు సురేష్, ట్రెజరర్ ఎస్. వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.